విశాలాంధ్ర

తిరుపతి జిల్లా

చిత్తూరు జిల్లా

మంగళవారం 15 అక్టోబరు 2024 | 8 పేజీలు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: ప్రముఖ శైవ క్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వరాలయానికి ఎవరు అధికారులుగా వచ్చినా అసంబద్ధ... వివాదాస్పద నిర్ణయాలు తీసుకోవడం వాటిని అమలు చేయడం పరిపాటిగా మారిపోయింది. కొందరు తమకేమీ సంబంధం లేనట్లు వ్యవహరిస్తే మరికొందరు అన్నీ తామే అన్నట్టుగా ప్రవర్తిస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆలయంలో అన్నీ మంచి కార్యక్రమాలు జరుగుతాయని... గత వాసనలు ఉండవని అందరూ భావించారు. అయితే అందుకు విరుద్ధంగా సంప్రదాయం పేరుతో వివాదాస్పద నిర్ణయాలు... సంస్కరణల పేరుతో నిబంధనలు అమలు చేయడంలో అధికారులు విజయం సాధిస్తున్నారు. సిబ్బంది సంప్రదాయ దుస్తులు ధరించాలనే నిబంధన ఎప్పటినుంచో ఉంది. అదేవిధంగా భక్తులు కూడా సంప్రదాయ దుస్తులు ధరించి రావాలనే నిబంధన పెట్టడం కూడా సబబే. అయితే అమలుకు కొంత సమయం ఇవ్వాలి. అనుకున్నదే తడవుగా అమలు చేయడం ఎంతవరకు సమంజసమో అధికారులు ఆలోచించాలి.

శివ శివా ఇదేం పద్ధతి... ఇదేం సంప్రదాయం...

- స్థానికులపై ఎందుకీ నిబంధనలు
- అవినీతిని పట్టించుకోని అధికారులు

2

మద్యం షాపుల టెండర్ల

ఓపెన్ లాటరీ ప్రక్రియ ప్రశాంతం

– జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్

విశాలాంధ్ర- తిరుపతి : జిల్లాలో ప్రభుత్వ నూతన మద్యం పాలసీ మద్యం షాపుల టెండర్లకు సంబంధించిన ఓపెన్ లాటరీ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా ప్రశాంతంగా నిర్వహించడం జరిగిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. సోమవారం ఉదయం నుండి తిరుచానూరు శిల్పారామం ఫంక్షన్ హాల్ నందు మద్యం దుకాణాల లాటరీ ప్రక్రియను జిల్లా కలెక్టర్ గారు జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, సంబంధిత ఎక్సైజ్ అధికారులతో కలిసి ప్రారంభించారు. మొత్తం 227 షాపులకు 3920 దరఖాస్తులు అందడం జరిగిందని వాటికి సంబంధించిన లాటరీ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, దరఖాస్తుదారుల సమక్షంలో నిర్వహించామని కలెక్టర్ తెలిపారు. సదరు ప్రక్రియ 227 మద్యం షాపులకు మధ్యాహ్నం వరకు పూర్తి అయిందని తెలిపారు. లాటరీ డిపోలో విజేతలుగా మద్యం షాపు దక్కించుకున్న వారు అక్టోబర్ 16 నుండి మద్యం షాపులను ప్రారంభించాల్సి ఉంటుందని, రేపు మద్యం డిపో నుండి స్టాక్ ను తీసుకెళ్లాల్సి ఉంటుందని సంబంధిత ఫీజును ఆరు విడతలుగా చెల్లించవచ్చని తెలిపారు. మొదటి విడత ఇన్స్టాల్మెంట్ ఈరోజు లేదా రేపు సాయంత్రం లోపు కట్టాల్సి ఉంటుందని తెలిపారు. లాటరీ ప్రక్రియ జరుగుతున్న ఫంక్షన్ హాల్ నందు లక్కీ విజేతగా మద్యం షాప్ దక్కించుకున్న వారు చలాన క్యాష్ డిపాజిట్ చేయుట కొరకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు కౌంటర్లు ఏర్పాటు చేశారని పలువురు సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి నాగమల్లేశ్వర రెడ్డి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్, జెసి వారి సహకారంతో అత్యంత పారదర్శకంగా మద్యం దుకాణాల లాటరీ ప్రక్రియను చక్కగా పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. మద్యం షాపుల టెండర్ల ద్వారా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖకు సుమారు 78.40 కోట్లు రూపాయల రెవెన్యూ సమకూరిందని తెలిపారు. మద్యం దుకాణాలు ఈనెల 16 నుండి ప్రారంభించాలని,

2

తిరుమలకు భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో

అప్రమత్తంగా ఉండాలి

అధికారులతో టీటీడీ ఈఓ జె.శ్యామల రావు

– వార్త 8వ పేజీలో

తుపాను నేపథ్యంలో విద్యుత్ శాఖ అప్రమత్తం

విద్యుత్ సరఫరా పర్యవేక్షణకు నోడల్ ఆఫీసర్లు - డివిజన్ల స్థాయిలో కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు

ఎపిఎస్ పిడిసిఎల్ సిఎండి కె. సంతోష రావు

విశాలాంధ్ర- తిరుపతి : తుఫాను కారణంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వుండాలని ఎపిఎస్పిడిసిఎల్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోష రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎపిఎస్ పిడిసిఎల్ పరిధిలోని తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, నెల్లూరు, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి జిల్లాల

2

ప్రారంభానికి నోచుకోని 132/33 కెవి సబ్ స్టేషన్



- పనులు పూర్తయినా పట్టించుకోని పాలకులు
- లో-వోల్టేజ్ సమస్యతో సతమతమవుతున్న రైతులు
- కాలుతున్న విద్యుత్ నియంత్రికలు
- రెండు మండలాల రైతులు ఎదురుచూపు

విశాలాంధ్ర-పలమనేరు: దశాబ్దాలుగా పాలకులు పట్టించుకోలేదు... గత పాలకులు దృష్టి పెట్టారు... దశాబ్దాల కలకు శ్రీకారం చుట్టారు... పనులు శరవేగంగా చేపట్టారు. అన్నదాతల స్వప్నం ఆవిష్కృతమయింది. ప్రారంభానికి సిద్ధమయ్యింది. ప్రస్తుత పాలకులు పట్టించుకోలేదనే విమర్శలు రాకపోలేదు. కర్షకులకు అండగా నిలవలేదు.... నాణ్యమైన విద్యుత్ కొరకు... రెండు మండలాల రైతులు ఎదురుచూస్తున్నారు... పాలకులు తీరుపై మండిపడుతున్నారు. అన్నీ ఉన్నా అల్లుడినోట్లో శని అన్నట్లు తయారైంది వి.కోట, బైరెడ్డిపల్లి రైతుల పరిస్థితి. ఈ మండలాలకు శాంతిపురం నుండి 132/33 కె.వి సబ్ స్టేషన్ ద్వారా విద్యుత్ సరఫరా అవుతుంది. దశాబ్దాలుగా ఈ మండల రైతులకు నాణ్యమైన విద్యుత్ అందిన దాఖలాలు లేవు. లో-వోల్టేజ్ సమస్యతో నియంత్రికలు కాలిపోతున్నాయి. రైతులు విద్యుత్ కార్యాలయాలు చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. మూడు మండలాలకు తీవ్రతన్యతగల సబ్ స్టేషన్ ఒకటే ఉండడంతో సమస్య తీవ్రతరమైంది.

2

ఇదేం సంప్రదాయం...

(మొదటి పేజీ తరువాయి) ప్రతి ఏటా రాహు- కేతు పూజల వల్ల 70 శాతానికి పైగా ఆదాయం ఆలయానికి వస్తోంది. ఈ పూజలకు సంప్రదాయ దుస్తులు ధరించిన వారిని మాత్రమే అనుమతిస్తే ఆదాయం గణనీయంగా పడిపోయే ప్రమాదం ఉంది. అంతేగాకుండా చెడు ప్రచారం జరిగే ప్రమాదం లేకపోలేదు. ఆంధ్రప్రదేశ్ నుంచే కాకుండా తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, విదేశాల నుంచి కూడా భక్తులు వచ్చి రాహు -కేతు పూజలు చేయించుకుంటూ ఉంటారు. వారికి ముందుగా సమాచారం తెలియజేయాలి. అందుకు కొంత సమయాన్ని ఇవ్వాలి. ఉరుము ఉరిమినట్లు... మెరుపు మెరిసినట్లు ఆలోచన రావడం... అమలు చేయడం అసలుకే మోసం అనే విషయాన్ని అటు అధికారులు.. ఇటు ప్రభుత్వం గుర్తించాలి. ఇక స్థానిక భక్తులు ప్రతి రోజూ స్వామి అమ్మవార్లను దర్శించుకుని దిన చర్య ప్రారంభించే వారు చాలామంది ఉన్నారు. అదేవిధంగా సాయంత్రం వేళ మహిళలు కూడా భారీ సంఖ్యలో స్వామి అమ్మవార్ల దర్శనానికి వస్తుంటారు. స్థానికంగా ఉన్న ఆచారాలను కూడా అధికారులు గౌరవించాల్సి ఉంటుంది. నాలుగు గోపురాల నుంచి భక్తులు ఆలయంలోకి వెళుతుంటారు. గోపురాలు వద్ద ఉన్న సిబ్బంది స్థానికులను గుర్తించడం చాలా సులువు. అందరూ పీఆర్వో కార్యాలయానికి వెళ్లి ఆధార్ కార్డులు చూపించడం అనేది కష్టమైన పని. పి ఆర్ ఓ కార్యాలయంలో 20 మంది సిబ్బందిని నియమించినా ఆధార్ కార్డులు పరిశీలించి పంపడం అనేది కష్టమవుతుంది. ఆచరణలో అమలు కావడం సాధ్యం కాదు. ఎవరైనా.. ఏ అధికారైనా సాఫీగా జరిగిపోవాలని చూడాలి తప్ప అతిగా... వివాదాస్పదంగా ఉండాలని భావించకూడదు. నిర్ణయం తీసుకునే ముందు సాధ్యా సాధ్యాలను పరిశీలిం చాలి. గత ఐదేళ్లు వైసీపీ నాయకుల కనుసన్నల్లో ఆలయంలో అనేక అవకతవకలు... అవినీతి... అక్రమాలు... మితిమీరిన జోక్యం... జరగరానివన్నీ జరిగాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా అధికార పార్టీ నాయకుల జోక్యం పెరిగింది. అయితే కొందరు నాయకులు కేవలం కొన్నిటిపైనే దృష్టి పెడుతున్నారే తప్ప భక్తుల అవస్థల గురించి పట్టించుకోవడం లేదు. శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి భక్తుల మనోభావాలను పట్టించుకోవాలి. ఆలయంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలు, వసూళ్లు అతిథి గృహాలను ఉచితంగా ఉపయోగించుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అధికారులు భక్తులకు నిబంధనలు పెట్టడం. స్థానికులపై ప్రతాపం చూపించడం ఎంతవరకు సమంజసమో ఆలోచించాలి. తీసుకున్న నిర్ణయాలు అమలు చేయాల్సిందే అనే విధంగా వ్యవహరిస్తే భంగపాటు తప్పదని కూడా గుర్తించాలి. శివయ్య మూడో కన్ను తెరుస్తాడనే విషయాన్ని మరువకూడదు.

ప్రారంభానికి నోచుకోని 132/33 కెవి సబ్ స్టేషన్

(మొదటి పేజీ తరువాయి) వి.కోట పరిధిలో 132/33 కెవి సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని రైతులు విన్నవించుకున్నా పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదు. 2013 కాంగ్రెస్ ప్రభుత్వంలో వి.కోట మండలంలో సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థలాన్ని గుర్తించారు. 2014లో వి.కోటకు మంజూరైన సబ్‌స్టేషన్ అప్పటి ప్రభుత్వం కుప్పంకు తరలించుకు పోయింది. రైతులు పాలకులను నిలదీసినా ఫలితం లేకుండా పోయింది. దీంతో 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వాన్ని ఇక్కడి రైతులు నిలదీశారు. దశాబ్దాలుగా లో-వోల్టేజ్ సమస్యతో సతమతమవుతున్నామని, బోరు మోటార్లు, స్టాటర్లు కాలిపోతున్నాయి. నియంత్రికలు పాడైపోతున్నాయి. సగం ఖర్చు బోరు మోటార్లు, స్టార్టర్లు, నియంత్రికలకే సరిపోతుందని రైతులు నినదించారు. మునుపటి పాలకుల్లాగా మాటలతో మాయ చేయొద్దని అప్పటి పలమనేరు శాసనసభ్యులు వెంకటేగౌడను రైతులు కోరారు. కర్షకుల శాశ్వత సమస్యకు చరమగీతం పాడాలని కంకణం కట్టుకున్నారు. ప్రతిపాదనలు తయారుచేసి ఆగమేఘాలమీద విద్యుత్ శాఖ మంత్రి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఫైలు కదిలింది. సబ్ స్టేషన్ మంజూరయ్యింది. గతంలో కేటాయించిన భూమి అనువుగా లేకపోవడంతో ట్రాన్స్‌కో అధికారులు భూమి కేటాయించాలని రెవెన్యూ అధికారులను కోరారు. పట్టించుకోలేదు. విషయం ఎమ్మెల్యే వద్దకు వెళ్ళింది. దీంతో తమ సొంత గ్రామం తోటకనుమ రైతులతో చర్చించారు. 10 ఎకరాల భూమిని సబ్ స్టేషన్ నిర్మాణానికి భూసేకరణ ద్వారా సేకరించారు. త్వరితగతిన పనులు ప్రారంభించేలా కృషి చేశారు. అప్పటి విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పలమనేరు శాసనసభ్యులు వెంకటే గౌడ చేతులమీదుగా పనులు ప్రారంభించారు. ట్రాన్స్‌కో అధికారులు శరవేగంగా పనులు చేపట్టారు. 132/33 కెవి సబ్ స్టేషన్ పని ఆఖరిలో ఎన్నికలు వచ్చాయి. అప్పటికే ప్రారంభా నికి సబ్ స్టేషన్ సిద్ధమయ్యింది. అయితే ప్రస్తుతం తెదేపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అన్ని హంగులతో సబ్‌స్టేషన్ సిద్ధమైనా.. ప్రారంభానికి నోచుకోలేదు. వి.కోట, బైరెడ్డిపల్లి మండల రైతుల చిరకాల స్వప్నం నెరవేర్చేందుకు పాలకులు మొగ్గు చూపలేదని రైతులు వాపోతున్నారు. ప్రారంభానికి సిద్ధమైనా ఎందుకు ప్రారంభించలేదని కర్షకులు నిలదీస్తున్నారు. రైతులపై ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే సబ్‌స్టేషన్ ప్రారంభించి రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. సబ్ స్టేషన్ ప్రారంభిస్తే రెండు మండలాల్లోని రైతులకు నాణ్యమైన విద్యుత్ అందుతుంది. లో-వోల్టేజ్ సమస్య నుంచి శాశ్వతంగా బయట పడతారు. విద్యుత్ నియంత్రికలు కాలిపోవడం నిలిచిపోతుంది. బోరు మోటార్లు, స్టార్టర్లు పాడవడం ఆగిపోతుంది. రైతులు వ్యవసాయంపై దృష్టి పెట్టేందుకు అనువుగా ఉంటుంది. కోట్ల రూపాయల ప్రజాధనాన్ని ఖర్చు చేసి సబ్ స్టేషన్ నిర్మించి ప్రారంభించేందుకు పాలకులు తాత్సారం చేయడం సరికాదని రైతులు అంటున్నారు. ఇకనైనా పాలకులు సబ్‌స్టేషన్‌ను వెంటనే ప్రారంభించి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని వారు కోరుతున్నారు.

తుపాను నేపథ్యంలో విద్యుత్ శాఖ అప్రమత్తం

(మొదటి పేజీ తరువాయి) పరిధిలో తుఫాను కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిన సందర్భాల్లో విద్యుత్ పునరుద్ధరణ పనుల పర్యవేక్షణకు నోడల్ ఆఫీసర్లను నియమించినట్లు తెలిపారు. కడప సర్కిల్ కు చీఫ్ జనరల్ మేనేజర్ (ప్రాజెక్ట్స్, ఐటి) పి. అయూబ్ ఖాన్, నెల్లూరు సర్కిల్ కు చీఫ్ జనరల్ మేనేజర్ (ఎనర్జీ కన్సర్వేషన్, క్వాలిటీ కంట్రోల్) కె. ఆదిశేషయ్య, తిరుపతి సర్కిల్ కు చీఫ్ జనరల్ మేనేజర్ (ఓఎమ్) డి.ఎస్. వరకుమార్, కర్నూలు సర్కిల్ కు చీఫ్ జనరల్ మేనేజర్ (ట్రైనింగ్) ఆర్. పద్మ, అనంతపురం సర్కిల్ కు జనరల్ మేనేజర్ (ఐటి, శాప్) సిహెచ్ రామచంద్ర రావులను నోడల్ ఆఫీసర్లుగా నియమించామన్నారు.సంస్థ పరిధిలో సర్కిల్స్, డివిజన్స్ స్థాయిల్లో కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో సరఫరా పునరుద్ధరణ పనులను వేగవంతం చేయడం కోసం అధికారులు/ సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందాలు అందుబాటులో వుండాలన్నారు. వర్షం కురుస్తున్న సందర్భాల్లో ప్రజలు విద్యుత్ స్తంభాలను తాకవద్దని, లైన్ల కింద నిల్చో వద్దని సూచించారు. ఎక్కడైనా విద్యుత్ స్తంభాలు కూలిపోవడం, లైన్లు తెగిపడడంలాంటి సంఘటనలను గుర్తించినట్లయితే తక్షణమే సమీపంలోని విద్యుత్ శాఖ అధికారులు/ సిబ్బందికిగానీ లేదా టోల్ ఫ్రీ నంబర్లు:1912 లేదా 1800 425 155333కు కాల్ చేసి సమాచారం అందించాలని సూచించారు. అదేవిధంగా సంస్థ వాట్సాప్ నంబరు: 91333 31912కు చాట్ చేయడం ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చని సూచించారు.

ఓపెన్ లాటరీ ప్రక్రియ ప్రశాంతం

(మొదటి పేజీ తరువాయి) ఉదయం 10 గం.ల నుండి రాత్రి 10 గంటల వరకు మాత్రమే తెరిచి ఉంచాల్సి ఉంటుందని తెలిపారు. ఈ మద్యం దుకాణాల లైసెన్స్ 2024 నుండి 30సెప్టెంబర్ 2026 వరకు చెల్లుబాటు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసాచారి, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వాసుదేవ చౌదరి, ఊహా శ్రీ, ఎక్సైజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అధికారులందరూ మరింత అప్రమత్తంగా ఉండాలి

- మురుగునీటి కాలువలపై అక్రమ నిర్మాణాలు తొలగింపుకు చర్యలు చేపట్టండి
- రోడ్లపైకి వర్షపునీరు రాకూడదు : కమిషనర్ ఎన్.మౌర్య

విశాలాంధ్ర- తిరుపతి : బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా రానున్న రెండు రోజుల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్ మౌర్య అధికారులు ఆదేశించారు. సోమవారం తెల్లవారుజాము నుంచి వర్షాలు పడుతుండడంతో నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రధాన మురుగునీటి కాలువలు, ముఖ్యంగా పేరూరు చెరువు నుండి నీరు వచ్చే ప్రాంతాలను, నగరంలో కపిలతీర్థం, మాల్వాడి గుండం నుండి నీరు వెళ్లే ప్రాంతాలను, లోతట్టు ప్రాంతాలైన కోరమేనుగుంట, గొల్లవానిగుంట, జీవకోన ప్రాంతాలను ఇంజినీరింగ్, హెల్త్, టౌన్ ప్లానింగ్, ఇరిగేషన్ అధికారులతో కలసి పరిశీలించారు. నగరంలో ఎక్కడా వర్షపు నీరు నిలవకుండా సజావుగా వెళ్లేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. పేరూరు, కపిలతీర్థం, మాల్వాడి గుండం నుండి నీరు నగరంలోని ఎక్కువ రావడంతో నీరు నిలిచిపోతున్నాయని గతంలో జరిగిన సంఘటనలను అధికారులు వివరించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తుఫాను కారణంగా భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. మురుగుకాలువల్లో వర్షపునీరు నిలవకుండా, రోడ్లపైకి నీరు రాకుండా ఎప్పటికప్పుడు చెత్త తొలగించాలని అధికారులను ఆదేశించారు. నీరు సజావుగా వెళ్లేలా తగు చర్యలు చేపట్టాలని అన్నారు. కపిలతీర్థం, మాల్వాడి గుండం ప్రధాన కాలువలతో పాటు పలు ప్రాంతాల్లో కాలువలపై అక్రమంగా నిర్మించిన నిర్మాణాలు తొలగింపుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అధికారులు మీ ప్రాంతాల్లో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులూ రాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. పాన్ చెరువు లో అక్రమంగా నిర్మాణాలు ఉన్నాయని చెప్పడంతో పరిశీలించారు. అక్రమ నిర్మాణాలను సర్వే చేసి అక్రమ నిర్మాణాలు ఐతే తొలగించాలని అధికారులను ఆదేశించారు. గత నెలలోనే ప్రధాన కాలువలను శుభ్రం చేయడం వలన కొంత మేరకు నీరు సజావుగా వెళుతున్నాయని, కాలువల్లో చెత్త లేకుండా సిబ్బంది ఎప్పటికప్పుడు తొలగించాలని అన్నారు. పారిశుద్ధ్య పనులు మరింత మెరుగ్గా చేపట్టాలని అన్నారు. హెల్త్, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులు సమన్వయం చేసుకుని అన్ని పనులు సజావుగా జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కాగా తెల్లవారుజాము నుండే జేసిబి లు, ట్రిప్పర్లతో కాలువల్లో చెత్త తొలగించారు. కమిషనర్ వెంట ఆర్డీవో రామ్మోహన్, నగరపాలక సంస్థ సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, ఇరిగేషన్ ఎస్.ఈ. శివారెడ్డి, అర్బన్ , రూరల్ తహసీల్దార్లు భాగ్యలక్ష్మి, రామాంజులు నాయక్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, సి.పి.ఓ. దేవికుమారి,హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ.లు మహేష్, రమణ, లలిత, ఏ.సి.పి.లు రమణ, బాలాజీ, సర్వేయర్ కోటేశ్వర రావు, శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి, ఇరిగేషన్, రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

భారీ వర్షాల నుంచి ప్రజలను రక్షించడానికి అధికారులు

చర్యలు చేపట్టండి

చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు.

విశాలాంధ్ర -చిత్తూరు : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో చిత్తూరు పార్లమెంటు ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని చిత్తూరు పార్లమెంట్ సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు సూచించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా , ఈ నెల 14 నుంచి 17 వరకు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించినట్లు పేర్కొ న్నారు. మరీ ముఖ్యంగా రాయలసీమలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నం దున..,దీని పై చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు ఢిల్లీ నుంచి సోమవారం స్పందించారు. అల్పపీడనం నేపథ్యంలో బుధ,గురు వారాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారీ వర్షాల నుంచి ప్రజలను రక్షిం చడానికి జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టాలని ఎక్కడా రాజీపడకుండా తమ కర్తవ్యాన్ని చిత్తశుద్ధితో నిర్వర్తించాలని ఆయన సూచించారు.

సహకార సంఘ సభ్యుల ఎన్నికలకొరకు నోటీసు

(22(1)వ నియమము చూడును) మరియు 22(4) ఎఎ నియమము చూడును)

రిజిస్టరు నెం. AMC/CTR/DCO/98/1
రిజిస్టరు ఆఫీసు:. SBMADCOOPMT Society Ltd.
తిరుచానూరు, తిరుపతి.

1. సంఘము పేరు: శ్రీ బాలాజి పరస్పర సహకార జిల్లా కోఆపరేటివ్ మోటార్ ట్రాన్స్‌పోర్టు సొసైటి లిమిటెడ్, తిరుపతి.
2. ఎన్నుకొనవలసిన సభ్యుల సంఖ్య అధ్యక్షునితో సహా
   ఎ). రిజర్వు చేయబడిన స్థానముల సంఖ్య
   బి). వర్కర్ మెంబర్ డైరెక్టర్లు
   సి). నాన్ వర్కర్ మెంబర్ డైరెక్టర్
   డి).వెనుకబడిన తరగతులు: వర్కర్ మెంబర్ -1 నాన్ వర్కర్ మెంబర్ - 2
3). షెడ్యూలు కులము/తెగ/మరియు వెనుకబడిన తరగుతులకు కేటాయించబడిన ఏరియా లేక నియోజకవర్గము
4).పోలింగ్ జరుగు ప్రదేశము : సొసైటీ కార్యాలయము, తిరుపతి.
తేది: 29.10.2024 పోలింగు సమయము ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నము12.00 గంటల వరకు.
5). నామినేషన్ పత్రాలు సమర్పించవలసిన
   ఎ). తేది :27.10.2024
   బి). స్థలము : సొసైటీ ఆఫీసు, తిరుపతి
   సి). వేళలు : ఉ॥ 10.00 గం ॥ నుండి 12.00గం॥ల వరకు.
   డి). నామినేషన్‌కు నిర్దేశించిన ఫీజు వివరాలు:
      1). షెడ్యూలు కులాలు: రూ. 500/-
      2). షెడ్యూలు తెగలు రూ. 500/-
      3). వెనకబడిన తరగతులు రూ. 1500/-
      4. ఇతరులురూ. 2000/-
6). నామినేషన్ పత్రము పరిశీలన జరుగు తేది :27.10.2024
   సమయము: 12.00 గం॥ నుండి మ.1.00 గం॥ వరకు
   స్థలము :సొసైటీ ఆఫీసు, తిరుపతి.
7). వ్యాలిడ్ నామినేషన్ పత్రములు జాబితా ప్రచురణ
   తేది: 27.10.2024.
   సమయం: మ. 1.00 గం॥
   స్థలము : సొసైటీ ఆఫీసు, తిరుపతి.
8). నామినేషన్ పత్రముల ఉపసంహరణ
   తేది :27.10.2024.
   సమయం: మ.1.00 గం॥ నుండి 2.00 గం॥ వరకు
   స్థలము : సొసైటీ ఆఫీసు, తిరుపతి.
9). ఎన్నికల అధికారి పోలింగ్ ఫలితములు ప్రకటించు
   తేది : 29.10.2024.
   స్థలము : సొసైటీ ఆఫీసు, తిరుపతి.
   సమయము: పోలింగు ముగిసిన 2గం॥ల పిదప
10). సంఘము కమిటీ సభ్యులు (భర్తీ కాబడని రిజర్వు స్థానములకు) కోఆప్షన్ మరియు కార్యనిర్వాహక సభ్యుల ఎన్నిక.
సభ్యుల ఎన్నిక
తేది:
సమయము:
స్థలము:

గమనిక: వ్యాలిడ్ నామినేషన్ ఉపసంహరణ అనంతరము ఎన్నుకోబడవలసిన సంఖ్యకు సమానంగా లేక తక్కువగా యున్నచో ఎన్నికల ఫలితములను, ఎన్నికల నామినేషన్ పత్రములు ఉపసంహరణ తేది, సమయము, స్థలమునందు ఒక గంట పిదప ప్రకటించబడును.

తేది: 14.10.2024.
స్థలం: తిరుపతి.

సం/- ఎం.లియాఖత్ ఆలీ బేగ్
ఎన్నికల అధికారి.

ఎన్టీఆర్ జలాశయాన్ని పరిశీలించిన డిఈ

విశాలాంధ్ర – పెనుమూరు: మండలంలోని కల్వకుంట దగ్గర ఉన్నటువంటి ఎన్టీఆర్ జలాశయాన్ని డిఈ జయ చంద్రబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా సోమవారం ఉదయం కల్వకుంట ఎన్టీఆర్ జలాశయాన్ని పరిశీలించి నీటి సామర్థ్యాన్ని గేట్లను పరిశీలించారు. అంతేకాకుండా కలెక్టర్ ఆదేశాల మేరకు డిఇ పరిధిలో ఉన్నటువంటి జలాశయాలను పరిశీలన చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెనుమూరు మండలం ఏఈ భరత్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని ఒకరి మృతి

విశాలాంధ్ర – దొరవారి సత్రం : దొరవారి సత్రం మండల పరిధిలోని డివి సత్రం అండర్ పాస్ సమీపంలోని అప్ లైన్ వద్ద రైలు ఢీకొని ఒకరు మృతి చెందారు. మృతి చెందిన వ్యక్తి దొరవారి సత్రం మండలం కటవపల్లి హరిజన వాడికి చెందిన ఈదురు రాజేంద్ర ప్రసాద్ (32) గా రైల్వే పోలీసులు గుర్తించారు. అయితే రాజేంద్రప్రసాద్ కొద్దిరోజుల నుండి మానసికంగా బాధపడేవాడని రెండు రోజుల క్రితం ఇంటి నుండి బయటికెళ్ళిపోయాడు. అప్పటినుండి రాజేంద్రప్రసాద్ కోసం వెతుకుతున్న కూడా ఎక్కడా కనిపించలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. రాజేంద్ర ప్రసాద్ మృతదేహం రైల్వే పట్టాలపై ఉండడంతో ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. అనంతరం రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చాంద్ భాషాకు నివాళులర్పించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర – నాయుడుపేట : నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్.రఫీ తండ్రి చాన్ భాషా కు సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ దంపతులు నివాళులర్పించారు. చాన్ భాష ఆదివారం కన్నుమూసిన విషయం తెలిసిందే. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ స్థానిక ఎన్.డి.ఏ.కూటమి నేతలతో కలిసి రఫీ నివాసానికి చేరుకుని చాన్ బాషా పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.అనంతరం రఫీకుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి భగవంతుడు మనో ధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్చార్జి ఉయ్యాల ప్రవీణ్, టిడిపి నాయకులు నెలవల రాజేష్ పలువురు నాయకులు ఉన్నారు.

మాతమ్మకు మొక్కులు చెల్లింపు

విశాలాంధ్ర–తొట్టంబేడు: తొట్టంబేడు మండలం కొండ రాజులపల్లెలో నూతనంగా నిర్మించిన మాతమ్మ ఆలయంలో ప్రముఖ సంఘ సేవకులు, జాతీయ వినియోగదారుల హక్కుల కమిషను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలవగుంట భరత్ రెడ్డి సోమవారం మొక్కులు తీర్చుకున్నారు. గ్రామం చల్లగా ఉండాలని ఈ సందర్భంగా ఆయన అమ్మవారిని వేడుకున్నారు. మాతమ్మ ఆలయంలో మహాకుంభాభిషేకం పురస్కరించుకుని కలవగుంట భరత్ రెడ్డి సారె సమర్పించారు. సారె తీసుకెళ్లిన భరత్ రెడ్డికి కొండరాజులపల్లె వాసులు మంగళ వాయిద్యాలు, మేళ తాళాలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయసాంప్రదాయాలతో అమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. మాతమ్మ ఆలయ నిర్మాణానికి భారీ విరాళం అందించిన కలవగుంట భరత్ రెడ్డిని ఈ సందర్భంగా గ్రామస్థులు అభినందించి కృతజ్ఞతలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో మహేష్ నాయుడు, వెంకటరామయ్య, వెంకటయ్య, హరి నాయుడు, పరుశురాం, రాము, నవీన్, సతీష్, గోపి, పవన్, రాజేష్, శరత్, శ్రీను, రాము, గ్రామస్తులు, భరత్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

అక్టోబరు 28 నుండి 30వ తేదీ వరకు

శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి పవిత్రోత్సవాలు

విశాలాంధ్ర–చంద్రగిరి: శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో అక్టోబరు 28 నుండి 30వ తేదీ వరకు పవిత్రోత్సవాలు జరుగనున్నాయి. ఇందులో భాగంగా అక్టోబరు 27వ తేదీన ఉదయం 9 గంటలకు ఆచార్య రుత్విక్‌వరణం, సాయంత్రం 6 గంటలకు మత్సంగ్రహణం, సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణంతో ఈ ఉత్సవాలు శాస్త్రోక్తంగా ప్రారంభం కానున్నాయి. పవిత్రోత్సవాల్లో మొదటిరోజైన అక్టోబరు 28వ తేదీన ఉదయం యాగశాలలో వైదిక కార్యక్రమాలు, సాయంత్రం 6.30 గంటలకు పవిత్రప్రతిష్ఠ నిర్వహించనున్నారు. రెండో రోజు అక్టోబరు 29వ తేదీన మధ్యాహ్నం 12 గంటలకు పవిత్ర సమర్పణ చేస్తారు. చివరిరోజు అక్టోబరు 30వ తేదీ రాత్రి 7 గంటలకు పూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగియనున్నాయి. ఈ పవిత్రోత్సవాలలో వేదపఠనం, ఆలయశుద్ధి, పుణ్యాహవచనం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు టిటిడి అధికారులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

అగ్ని ప్రమాదంలో ఆస్తి నష్టం

విశాలాంధ్ర– పలమనేరు : పట్టణంలోని పాతపేట జెండా మఠం మసీదు వెనక ఆరిఫ్ అనే వ్యక్తి ఇంట్లో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. సోమవారం అగ్నిమాపక శాఖ అధికారులు అందించిన వివరాలు మేరకు, ఆరిఫ్ అనే వ్యక్తి ఇంట్లో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది సమాచారం అందుకొని వెను వెంటనే సంఘటన ప్రాంతాన్ని చేరుకొని మంటలను ఆర్పి వేయడం జరిగిందన్నారు. ఈ ప్రమాదంలో సుమారు లక్ష రూపాయలు ఆస్తి నష్టం జరిగిందని తెలిపారు. బాధితులు మాట్లాడుతూ ఇంట్లో ఉన్న వాషింగ్ మిషన్ ఫ్యాను, ఫ్రిడ్జ్ బట్టలు మరియు గృహపకరణాలు కాలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అగ్నిప్రమాదం ఎలా సంభవించిందో అధికారుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది.

పంచాయతీలలో అధికారులు సిద్ధంగా ఉండాలి

జిల్లా ప్రత్యేక అధికారి శ్రీనివాస్ ప్రసాద్

విశాలాంధ్ర–బుచ్చినాయుడు కండ్రిగ: భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించిన సమాచారం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తం అయ్యింది. జిల్లాలో కురుస్తున్న వర్షాలకు కారణంగా పంచాయతీ అధికారులు గ్రామాలలో సిద్ధంగా ఉండాలని జిల్లా ప్రత్యేక అధికారి శ్రీనివాస్ ప్రసాద్ అధికారుల సమావేశంలో వెల్లడించారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో సోమవారం అన్ని శాఖల అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా ప్రత్యేక అధికారి డ్వామా పిడి శ్రీనివాస ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సచివాలయంలో అధిక సంఖ్యలో సిబ్బంది ఉన్నారు. ప్రతి అధికారి వారికి కేటాయించబడిన గ్రామాలలో ప్రతిదీ విశదీకరంగా పరిశీలించి నివేదికలు అధికారులకు అందించాలన్నారు. వర్షాల ప్రభావం ఎంత తీవ్రతగా ఉంటాయో ఇటీవల విజయవాడలో కురిసిన వర్షాలనుబట్టి మనం తెలుసుకున్నామన్నారు. అలాంటి సంఘటనలు పునరావతం కాకుండా తగు చర్యలు తీసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించకుండా పనిచేయాలన్నారు. 14 తారీకు నుండి 17వ తేదీల్లో కురిసే భారీ వర్షాలకు వాతావరణ శాఖలు అంచనాలకు మించి వెల్లడించి ఉన్నారు. దీనిపై ప్రతి అధికారి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయా గ్రామాల చెరువులు పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవాలని అన్నారు. గేదెలు, గొర్రెలు, మేకలు, ఆవులు, మూగజీవాలను కాపాడే బాధ్యత ముందస్తు చర్యలు వలనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో త్రివిక్రమ్ రావు,తహసిల్దార్ సుబ్రహ్మణ్యం, రెండవ విద్యాశాఖ అధికారి ఆవల ముని సుబ్రహ్మణ్యం, ఎస్సై విశ్వనాథ్ నాయుడు, పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ మునిరాజా, ప్రాథమిక ఆరోగ్య వైద్య అధికారి దివాకర్, పంచాయతీ కార్యదర్శులు సచివాలయం సిబ్బంది, పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఆర్డబ్ల్యూఎస్, అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బొజ్జల నిర్ణయాలపై హర్షం

విశాలాంధ్ర –శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి తీసుకుంటున్న ముందస్తు నిర్ణయాల పట్ల నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వాతావరణ శాఖ ముందస్తు హెచ్చరికల భారీ వర్ష సూచనతో ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి అధికారులను, సిబ్బందిని అప్రమత్తం చేశారు. నియోజకవర్గంలో లోతట్టు ప్రాంతాలలోని అధికారులను అప్రమత్తం చేస్తూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలంటూ అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా అధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. బంగాళా ఖాతంలో ఏర్పడ్డ అల్ప పీడనంతో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఎమ్మెల్యే ఇటీవల తీసుకున్న నిర్ణయాలకు పట్టణ ప్రజల నుంచి ప్రశంసలు వెల్లు వెత్తుతూ వున్నాయి. మురికి నీటి కాల్వల్లో పేరుకుపోయిన సిల్ట్ (మురికి) తొలించేందుకు వెనక్కి తగ్గలేదు. ఫలితంగా నేడు కురుస్తున్న వర్షాలకు పట్టణంలో ఎక్కడా వర్షపు నీరు ఆగకుండా సజావుగా చెంబేడు కాల్వకు చేరుతోంది. అలాగే ఈ నివాసానికి వర్షపు నీరు ఇబ్బంది కల్గించకపోవడంతో ప్రజలు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలియజేస్తూ వున్నారు. దీంతో ఎమ్మెల్యే తీసుకుంటున్న ప్రతీ చర్య ప్రజాపయోగంగా మారుతోందని పట్టణ ప్రజలు ప్రశంసిస్తున్నారు. ఎమ్మెల్యే ఈ పని చేయకుంటే కురుస్తున్న వర్షాలకు ఎక్కడ మురికి నీరు అక్కడే నిల్వ చేరి దోమలు ఉత్పత్తి పెరిగి పుర ప్రజలు పలు అంటు రోగాల బారిన పడే వారని పుర ప్రజలు అంటున్నారు.

తుఫాను పట్ల అప్రమత్తంగా ఉందాం

-గాలి మురళినాయుడు

విశాలాంధ్ర–తొట్టంబేడు: తుఫాను పట్ల అప్రమత్తంగా ఉందామని తొట్టంబేడు మండల టీడీపీ అధ్యక్షులు గాలి మురళినాయుడు సూచించారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండంతో తొట్టంబేడు మండల పరిధిలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయన్నారు. ఈ వర్షంతో ప్రమాదాలు జరగకుండా ప్రజలు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు. రైతులు వ్యవసాయ పొలంలోకి వెళ్లి చెట్ల కింద నిలబడడం, కరెంటు స్తంభాల పక్కన ఉండటం ప్రమాదమన్నారు. తెలుగు గంగ కాలువ పొంగే సమయంలో పిల్లలను ఇంటి నుంచి బయటకు రానీయకుండా అదుపు చేయలన్నారు. ఇక గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా కార్యదర్శులు బ్లీచింగ్ చేయడం, పీహెచ్ సీ సిబ్బంది ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండి సహాయక చర్యలు చేపట్టాలని మురళినాయుడు కోరారు. సర్పంచులు, ఎంపిటీసీలు, ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆయన కోరారు.

సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో విశేష పూజలు

విశాలాంధ్ర – రామకుప్పం : మండలంలో నెలవైన శ్రీ వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యస్వామి దేవాలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామివారికి నిత్య అభిషేకాలు నిర్వహించి, ధూప దీప నైవేద్యాలతో హారతులు ఇచ్చి భక్తులకు దర్శన ఏర్పాటు చేశారు . ప్రతి ఏట నిర్వహిస్తున్న సోమ వారోత్సవాల్లో భాగంగా ఆరవ వారం కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ప్రాకారోత్సవం, నాగల పుట్ట వద్ద పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు అందేవిధంగా భక్తాదులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కుప్పం రూరల్ సీఐ మల్లేష్ యాదవ్ తమ పోలీసు సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

డివి సత్రంలో 40.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

విశాలాంధ్ర– దొరవారిసత్రం: దొరవారిసత్రం మండలంలో ఆదివారం ఉదయం 8 నుండి నుండి సోమవారం ఉదయం 8 వరకు 40.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు సోమవారం తాసిల్దార్ శైలు కుమారి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా తాసిల్దార్ శైలు కుమారి మాట్లాడుతూ బంగాళాఖాతంలో వాయుగుండం భారీ వర్షాల నుండి తుఫానుగా మారే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ వర్షంలో ఎత్తయిన చెట్లు వద్ద గాని సెల్ ఫోన్ టవర్ వద్ద గాని ఉండకూడదని సూచించారు. ముఖ్యంగా వర్షాలకు ఏ గ్రామంలో అయినా ఎలాంటి సమస్య ఎదురైనా వెంటనే డివి సత్రంలో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ నెంబర్‌కు 8341614507కు తెలియజేయాలని ఆమె సూచించారు.

రైతులందరూ ఇ-పంటనమోదు చేసుకోవాలి

విశాలాంధ్ర– ఏర్పేడు: యండి పుత్తూరు గ్రామంలో రైతు సేవా కేంద్రం నందు వ్యవసాయశాఖ వారి ఆధ్వర్యంలో ఇపంట నమోదు సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించబడినది. ఈ కార్యక్రమనకు ముఖ్య అతిథిగా సర్పంచ్ మోహనప్రియ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ భారతి గ్రామంలో రైతులు నమోదు చేయించుకున్న ఇపంట సమోదు వివరాలను అందరికీ తెలియపరిచారు. ఈ సందర్భంగా సర్పంచ్ మోహనప్రియ మాట్లాడుతూ ప్రతి రైతు కూడ ప్రతి పంటకూ బాధ్యతగా ఇ-పంటనమోదు చేయించుకోవాలని ఏదైనా విపత్తు సంభవించిన ఇ పంట నమోదు చేయించుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వం నష్టపరిహారం అందించేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్‌అసిస్టెంట్ భారతి, తెదేపా నాయకులు రైతులు పాల్గొన్నారు.

స్థానికులు ఆధార్ చూపితేనే

ముక్కంటి దర్శనానికి అనుమతి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర స్వామిని దర్శించుకోవాలంటే స్థానికులు ఆధార్ కార్డు తప్పని సరిగా చూపి పీఆర్వో కార్యాలయంలో తీసుకోవాల్సిందేనని ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎస్ఎస్ చంద్రశేఖర్ ఆజాద్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. శ్రీకాళహస్తి పట్టణ వాసులకు ఉదయం 6 నుంచి 7గంటల మధ్య రాత్రి 7 నుంచి 8.30గంటల మధ్య స్వామి అమ్మవార్ల దర్శనానికి అనుమతిస్తామని ఆయన తెలిపారు. దర్శనానికి వచ్చే వారు తమ ఆధార్ కార్డు తీసుకుని వచ్చి పీఆర్వో కార్యాలయంలో తమ పేరు నమోదు చేసుకుని రసీదు తీసుకోవాలన్నారు. అలా అనుమతి తీసుకున్న వారికి మాత్రమే ఆలయ ప్రధాన ద్వారం కంచు గడప వద్ద సాధారణ క్యూలైన్ నుంచి అనుమతిస్తామని ఈవో చంద్రశేఖర్ ఆజాద్ పేర్కొన్నారు. స్థానికులు ఇది గమనించి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అయితే ఈవో చంద్రశేఖర్ ఆజాద్ నిర్ణయం పట్ల స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆధార్ కార్డు చూపితే నేరుగా క్యూలైన్‌లో అనుమతించాలని పీఆర్వో కార్యాలయానికి వెళ్లి తమ పేరు నమోదు చేసుకుని రసీదు తీసుకోవాలనే నిబంధన తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ నిర్ణయంపై ఈవో పునఃసమీక్షించాలని ముక్కంటి భక్తులు కోరుతున్నారు.

రానున్న మూడు రోజులు అప్రమత్తంగా ఉండాలి

: డ్రామా పిడి శ్రీనివాస్ ప్రసాద్

విశాలాంధ్ర- సత్యవేడు: వాతావరణ శాఖ, రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖ వెల్లడించిన తుఫాను హెచ్చరికల నేపథ్యంలో మరో మూడు రోజులు పాటు అధికారులు అప్రమత్తంగా ఉండాలని డ్రామా పీడీ విపత్తుల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ ప్రసాద్ సూచించారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసిల్దార్ సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో చంద్రశేఖర్, ఎస్ఐ రామస్వామి తదితరులతో కలిసి తుఫాను ప్రభావంపై మండల అధికారులతో సమీక్షించారు. భారీ వర్షాల ప్రభావిత ప్రాంతాలలో అధికారులు పర్యటించి అవసరమున్న చోట చేపట్టాల్సిన పునరావాస కేంద్రాలు, లోతట్టు ప్రాంతాలను గుర్తించి ప్రజలను అప్రమత్తం చేయాలని అన్నారు.పునరావాస కేంద్రాలల్లో అన్ని వసతులు వుండేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రవి,ఎంఈఓ 2 ఉష,మండల ఇంజనీర్ ఇబ్రహీం ఖాన్,పలువురు పంచాయతీ సెక్రటరీలు వీఆర్వోలు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్ అందేలా చర్యలు:ఎంపీడీవో

విశాలాంధ్ర – రామకుప్పం : మండల పరిధిలోని ప్రజలు అర్హులై ఉండి వివిధ కారణాలతో ఇప్పటి వరకు పెన్షన్ మంజూరు కాని వారు ఈనెల 15 మంగళవారం నుండి మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలో పెన్షన్ మంజూరు సర్వే ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీవో లక్ష్మీకాంత్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంచే పెన్షన్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. పంచాయతీ పరిధిలోని సచివాలయాల లోని వెల్ఫేర్ ఆఫీసర్ మరియు పంచాయతీ కార్యదర్శుల వద్ద తమ ఆధార్ కార్డు, రేషన్ కార్డు, మరియు కుల ధృవీకరణ పత్రం తో పాటు ఆధార్ కార్డు కు లింక్ అయి ఉన్న ఫోన్ నెంబరుతో తమ పేరును నమోదు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా ఈ కార్యక్రమాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మండలప్రజలు అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-చిల్లకూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వలన తిరుపతి జిల్లా అంతటా విస్తారంగా మరియు భారీగా వర్షాలు పడనున్న విషయం వాతావరణ శాఖ వారు తెలియపరచడంతో , తాహశీల్దారు శ్రీనివాసులు మండల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మత్స్యకారులు చేపల వేటకోసం సముద్రం లోకి వెళ్ళరాదని , భారీ వర్షాలకు పొంగే వాగులు , కాల్వలు, కల్వర్టులు, మ్యాన్ హోల్సు కు దూరంగా ఉండాలని హెచ్చరించారు. తహశీల్దార్ కార్యాలయంలో 24ఐ7 పనిచేసే కంట్రోల్ రూము ఏర్పాటు చేయడం జరిగింది అని తహశీల్దార్ తెలిపారు.

హత్య కేసులో ముద్దాయి అరెస్టు

విశాలాంధ్ర-చిల్లకూరు: తిక్కవరం సమీపంలోని మామిడి తోటలో సెప్టెంబరులో జరిగిన జడల వెంకటేశ్వర్లు (35) హత్య కేసులో ముద్దాయి మానికల అంకయ్యను ఎస్ ఐ సురేష్ బాబు సోమవారం అరెస్టు చేశారు.గూడూరు రూరల్ సిఐ కిషోర్ బాబు మాట్లాడుతూ ముద్దాయి ని న్యాయస్థానంలో న్యాయమూర్తి ముందు ప్రవేశ పెట్టడం జరుగుతుంది అని తెలిపారు.

కలెక్టర్ గారు జాతీయ రహదారిపై కన్నేయండి

- మండల పరిధిలో జాతీయ రహదారి అధికారుల తీరు ప్రయాణికులకు శాపం
- ఫలితంగా తరచూ రోడ్డు ప్రమాదాలు ప్రాణాలు కోల్పోతున్న ప్రయాణికులు - కిలోమీటర్ల బారులు దీరిన వాహనాలు

విశాలాంధ్ర – గుడిపాల : మండలంలోని చిత్తూరు వేలూరు జాతీయ రహదారి ఎం.సి.ఆర్ క్రాస్ నుండి గొల్లమడుగు వరకు గల జాతీయ రహదారి భారీ గుంతల మయంగా దర్శనమిస్తూ ప్రయాణికులకు వాహన చోదకులకు యమపాశాలుగా మారింది, ఈ రహదారిలో ఆదమరిస్తే అంతే సంగతి, మరి అనునిత్యం వేలాది వాహనాలు ఈ మార్గం గుండా వెళుతూ ఉంటాయి, ఇక ప్రమాదాలైన ఇతర ఎమర్జెన్సీ అయినా గుర్తుకొచ్చేది వేలూరు నందు సి.ఎం.సి వైద్య సేవలు ఈ మార్గం గుండానే వెళ్లి పొందాల్సి ఉంటుంది, ఈ మార్గంలో వెళ్తే గుంతలు కారణంగా అటు నుంచి అటే అని ప్రాణాలు కోల్పోతున్న వారెందరో, కాస్త దూరమైన రాణి పేట సిఎంసి క్యాంపస్ ఆసుపత్రికి వెళ్లాం అన్నా బొమ్మసముద్రం నందు రైల్వే బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా గత ఆరు నెలలుగా వాహన మళ్లింపు పక్క గ్రామాల వైపు చేయడంతో పరిస్థితి మరింత ధ్యానంగా తయారైంది అంబులెన్స్ సర్వీసులు ఇతర వాహనాలు రాకపోకలు సాగించే ఈ రహదారి దుస్థితి చిన్న చిన్న ఆర్ అండ్ బి రోడ్ల కంటే దుర్భరంగా మారింది, మరి వర్షాకాలంలో పరిస్థితి మరింత ప్రమాదకరంగా ఉంటుంది, రోడ్లపై గుంతలు కోతలతో ఆ రహదారిలో ప్రయాణించాలంటేనే ప్రయాణికులు భయభ్రాంతులకు గురవుతున్నారు అంతేకాకుండా రహదారి పుణ్యమా అంటూ తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి, అంతేకాకుండా పాత రహదారులు మరమ్మతులకు నోచుకోపోగా కొత్తగా జరుగుతున్న రహదారి పనులు మరింత నత్తనడకన సాగుతున్నాయి, ఒక్క వాహనం బ్రేక్ ఫెయిల్ తో కిలోమీటర్ల ట్రాఫిక్ జామ్‌తో పోలీసులకు సవాలు గా మారుతుంది. ఇంత దీన పరిస్థితికి రహదారులు చేరుకున్నప్పటికీ సంబంధించిన అధికారుల తీరు ప్రయాణికుల ప్రాణాలు కోల్పోతే మాకేంటి గాయాల పాలైతే మాకేంటి అనే లెక్కలో ఉంది ఇప్పటికైనా అధికారులు స్పందించి భవిష్యత్తు ప్రమాదాల నివారణ కోసం రహదారిని మరమ్మతులు చేయాలని వాహన చోదకులు పలువురు కోరుకుంటున్నారు.

వైద్య ఆరోగ్య శాఖలో ఉద్యోగాల భర్తీపై

విజిలెన్స్ ఎంక్వయిరీకి ప్రభుత్వం ఆదేశం

విశాలాంధ్ర -చిత్తూరు: చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో దాదాపు 360 ఉద్యోగాలు, స్టాఫ్ నర్సులు, పారామెడికల్ సిబ్బంది, ఆఫీస్ అపార్డినేట్స్, ల్యాబ్ టెక్నీషియన్స్, ఉద్యోగాల భర్తీపై రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ ఎంక్వైరీ కి ఆదేశించినట్లు తెలుగుదేశం నేతలు సప్తగిరి ప్రసాద్, మోహన్ రాజ్ తదితరులు తెలిపారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పెద్ద ఎత్తున డబ్బులు తీసుకొని ఈ పోస్టు లు భర్తీ చేయడం జరిగిందని. అప్పటి మంత్రి పెద్దిరెడ్డి ఒత్తిడి మేరకు అప్పటి జిల్లా అధికార యంత్రాంగం నిరుద్యోగుల నుండి పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేసి ఉద్యోగాలు అమ్ముకోవడం జరిగిందని ఆరోపించారు. దీనిపైన అప్పటి ఉద్యోగ సంఘాలు, అభ్యర్థులు పెద్ద ఎత్తున ఆందోళన కూడా వ్యక్తం చేశారని, కానీ నిరుద్యోగుల యొక్క మొరను అప్పటి ప్రభుత్వం పెడచెవిన పెట్టిందన్నారు. అప్పటి వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీకి ఫిర్యాదులు కూడా చేయడం జరిగిందని చెప్పారు. కానీ అప్పటి ప్రభుత్వం మొద్దు నిద్రపోయిందన్నారు. కానీ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత, తెలుగుదేశం పార్టీ నాయకులు చేసిన ఫిర్యాదు ఫలితంగా విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ విచారణకి ఆదేశించడం జరిగింది. ఈ మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి కూడా విజిలెన్స్ఎన్ఫోర్స్మెంట్ అధికారులు తాకీదులు ఇవ్వడం జరిగిందన్నారు.విజిలెన్స్ విచారణకు ఆదేశించిన రాష్ట్ర ప్రభుత్వం చర్యలపైన చిత్తూరు జిల్లా తెలుగుదేశం పార్టీ హర్షం వ్యక్తం చేసినట్లు చెప్పారు.

పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన సిఐ

విశాలాంధ్ర – సోమల : సోమల మండల పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన సర్కిల్ ఇన్స్పెక్టర్ రాంభూపాల్.ఈ క్రమంలో ఆయన స్టేషన్ లో రికార్డులు ను తనిఖీలు నిర్వహించారు. అలాగే ప్రభుత్వ ఆదేశాల మేరకు రాబోవు రెండు రోజుల లోవస్తున్న తుఫాన్ కారణంగా ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆయన సూచించారు. అలాగే ప్రజలను అప్రమత్తం చేయాలని ఎస్ఐశివ శంకర్ మరియు సిబ్బందికి సూచించారు

వైన్ షాపులు దక్కించుకున్నాది వీరే

విశాలాంధ్ర -ఏర్పేడు : ఏర్పేడు మండల పరిధిలో ఏడు మద్యం షాపులకు 36 మంది దరఖాస్తులు చేసుకున్నారు. అందులో ఏడుగురు షాపులు దక్కించుకున్నారు. ఒకటి టి రమేష్, రెండు డి నాగేశ్వరరావు,మూడు పి నాగరాజు నాయుడు, నాలుగు జీ సురేష్, ఐదు జీ కిరణ్ కుమార్, ఆరు ఆర్ రఘుపతి నాయుడు,ఏడు వై మనోహర్ నాయుడు దక్కించుకున్నారు.

సచివాలయం ఆర్ బి కే సెంటర్లకు వెళ్లే దారి మూసివేత

ఘటన స్థలానికి వెళ్లి విచారించిన ఎంపీడీవో

విశాలాంధ్ర-పలమనేరు : పలమనేరు ఎంపీడీవో ఖాదర్ బాషా తెలిపిన సమాచారం మేరకు పలమనేరు రూరల్ మండలం జగమర్ల గ్రామంలో గత వైసిపి ప్రభుత్వం సచివాలయం మరియు ఆర్.బి.కె భవనాలను సుమారు కోటి రూపాయల వ్యయంతో నిర్మించి ఉన్నారు. దారి సమస్యతో సచివాలయం ఆర్ బి కే సెంటర్లకు వెళ్లే రహదారిని జగమర్ల గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు మూసివేయడంతో గ్రామంలో ఇరు వర్గాలకు మధ్య తీవ్ర వాగ్వాదం ఘర్షణ వాతావరణం నెలకొని ఉందన్నారు. దీంతో సచివాలయం ఆర్ బి కే సెంటర్ లకు బీగాలు వేశారు ఉద్యోగులు. సమాచారం అందుకుని ఘటనా ప్రాంతానికి చేరుకొని ఇరు వర్గాల వాదనలను పరిశీలించాము త్వరలోనే విచారించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

పంట పొలాలపై ఏనుగుల గుంపు దాడి

విశాలాంధ్ర-పాకాల : పాకాల మండలం ఈ . పాలగుట్ట పల్లె గ్రామపంచాయతీ పరిధిలోని పంట పొలాల పై ఆదివారం రాత్రి ఏనుగుల గుంపు దాడి చేసి పంటలను ధ్వంసం చేశాయి. ఈ పాలగుట్టపల్లి ,వెంకట్రామాపురం గ్రామాల సమీపంలోని వరి, చెరకు, మామిడి పంట పొలాలపై ఆదివారం రాత్రి ఏనుగుల గుంపు దాడి చేసి పంటలను ధ్వంసం చేశాయి. గత కొన్ని రోజుల నుండి పది పట్ల బైలు ఈ పాలగుట్టపల్లి గ్రామ పంచాయతీల పరిధిలోని పొలాలపై ఏనుగుల గుంపు దాడులు చేస్తున్నాయని ఈ విషయాన్ని అటవీ శాఖ అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడంలేదని బాధితు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంతో వ్యయ ప్రయాసలకు ఓర్చి కష్టపడి సాగుచేసిన పంటలపై ఏనుగులు దాడి చేస్తుండడంతో తమకు తీవ్ర నష్టం కలుగుతోందని బాధిత రైతుల విలపిస్తున్నారు . ఇకనైనా అటవీ శాఖ అధికారులు చర్యలు చేపట్టి తమకు నష్టపరిహారం ఇప్పించడంతోపాటు ఏనుగులు రాకుండా తమ పంటలను కాపాడాలని కోరుకుంటున్నారు.

ఇస్రోకు ప్రతిష్ఠాత్మక ఐఏఎఫ్ అవార్డు

విశాలాంధ్ర-సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుండి చంద్రయాన్- 3 రాకెట్ను ప్రయోగించి ఘన విజయం సాధించి అగ్రదేశాల సరసన భారత దేశాన్ని నిలిపినందుకు ఐఏఎఫ్ సంస్థ ప్రతిష్ఠాత్మక అవార్డులను ఇస్రో కు అందజేశారు. ఈ ఏడాది ఈ అవార్డు కార్యక్రమాన్ని ఐఏసి-2024 ఇటలీలోని మిలన్ నగరం నందు నిర్వహించారు. ఈ అవార్డును ఇస్రో తరపున చైర్మన్ సోమనాథ్ ఇటలీలో ఈ అవార్డుని అందుకున్నారు. ఈ అవార్డును అందుకున్నందుకు ఇస్రో శాస్త్రవేత్తలు, ఇస్రో ఉద్యోగస్తులు, సులూరుపేట శాసనసభ్యురాలు నెలవల విజయశ్రీ, ప్రముఖ వ్యాపారవేత్త శ్రీ సిటీ అధినేత రవి సన్నారెడ్డి, ఇస్రో చైర్మన్ కు అభినందనలు తెలిపారు.

డ్రైనేజీ కాలువలను పరిశీలించిన కమిషనర్

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: తుఫాన్ కారణంగా అధిక వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరికలతో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు శ్రీకాళహస్తి మున్సిపల్ యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ మేరకు తుఫాను హెచ్చరికతో ప్రాజెక్ట్ వీధిలో మున్సిపాలిటీ కమిషనర్ తన సిబ్బందితో కలిసి డ్రైనేజీ కాలవలు పరిశీలించారు. ప్రజలకు ఏ ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు. అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ సిబ్బంది, యూనిట్ ఇంచార్జ్, అర్ముగం, కార్యకర్తలు, శంముగం, సునీల్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆదిమూలం ఓమహిళతో అసభ్యకర సంభాషణపై ఆడియో కలకలం

ఇటీవల రాసలీల వీడియో ఘటన మరువక ముందే మరో రాసలీల వ్యవహారం

విశాలాంధ్ర-సత్యవేడు: సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఓ మహిళతో అసభ్యకర సంభాషణపై సోమవారం ఆడియో లీక్ అయ్యాయి. ఆదిమూలం ఓ మహిళతో జరిపిన రాసలీల సంభాషణ ఆడియో తాజాగా లీక్ కావడంతో పలు సామాజిక మాధ్యమంలో సంభాషణ ఆడియో చక్కర్లు కొడుతుండడం చర్చనీయాంశంగా మారింది. ఇటీవల ఎమ్మెల్యే ఆదిమూలం నియోజవర్గ పరిధిలోని కెవిబి పురం మండలానికి టిడిపి ఓమహిళ నాయకురాలితో జరిపిన రాసలీల వ్యవహారం వీడియో బయటకు రావడంతో పాటు వివిధ టీవీ చానల్స్ లో కూడా ప్రసారం కావడం జరిగింది. ఈ వివాదం సద్దుమణిగింది అని అనుకునే లోపే ఎమ్మెల్యే మహిళతో జరిపిన రాసలీల సంభాషణ బయటికి రావడం గమనార్హం. ప్రస్తుతం సోషల్ మీడియాలో చక్కెరలు కొడుతున్న ఆడియోలో ఉన్న మహిళ ఎవరన్నది పూర్తిస్థాయిలో పోలీసులు విచారణ జరిపితే తప్ప తేలే అవకాశాలు ఉండవు. ఇదిలా ఉండగా ఎమ్మెల్యే ఆదిమూలం అక్టోబర్ 14 సోమవారం నుంచి పల్లె పండగ వంటి ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొన్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం నుండి రెండు రోజుల క్రితం ఓ ప్రకటన విడుదలైంది. ఈ నేపథ్యంలో ఓ మహిళతో ఎమ్మెల్యే ఆదిమూలం జరిపిన రాసలీల సంభాషణ ఆడియో లీక్ కావడం సర్వత్రా చర్చకు దారి తీసింది. ఏది ఏమైనా రాసలీల వ్యవహారం విషయంలో ఎమ్మెల్యే ఆదిమూలంకు ఒకటి వెనుక మరొకటి చుట్టి ముట్టడం, దీనిపై అధిష్టానం కూడా ఎలా ముందుకెళ్తుందో వేచి చూడాల్సి ఉంది.

పల్లంలో పల్లె పండుగ

విశాలాంధ్ర -ఏర్పేడు: పల్లం గ్రామపంచాయతీ నందు దళిత వాడలో సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పల్లె పండుగ కార్యక్రమాన్ని మండల స్థాయి అధికారులు టిడిపి నేతలు నిర్వహించడం జరిగింది. పల్లం దళితవాడకు 8 లక్షల రూపాయల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి అధికారులు నాయకులు చేశారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి మాట్లాడుతూ 2019 ముందు టిడిపి ప్రభుత్వంలో అప్పటి పంచాయతీ రాజ్ శాఖ మంత్రి నారా లోకేష్ సారధ్యంలో వేల కిలోమీటర్ల సిసి రోడ్ల నిర్మాణం వేల కిలోమీటర్ల డ్రైనేజ్ కాలువల నిర్మాణం చేపట్టడం జరిగిందని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధిని పరుగులు పెట్టించడానికి పల్లె పండుగ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు కావలసిన మౌలిక సదుపాయాలను గుర్తించి పనులను చేపట్టడం జరుగుతుందన్నారు. మొదటగా ఏర్పేడు మండలంలో పల్లం దళితవాడ నుండి పల్లె పండుగ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సౌభాగ్యం, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, టిడిపి ఏర్పేడు మండల అధ్యక్షులు నైనారు పున్నారావు, టిడిపి నాయకులు చంద్రశేఖర్ నాయుడు నాగేశ్వరరావు రాజకుమార్ నాయుడు పల్లం రాజా తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ

- నియోజకవర్గంలో 12 కోట్లతో సిసి రోడ్లు - ఎమ్మెల్యే డాక్టర్ థామస్

విశాలాంధ్ర-కార్వేటినగరం: నియోజకవర్గంలో 12 కోట్ల రూపాయలతో సిమెంట్ రోడ్లకు మహర్దశకు నోచుకుందని జీడి నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం.థామస్ అన్నారు. సోమవారం ఎమ్మెల్యే స్వగ్రామమైన అల్లాగుంట గ్రామానికి 20 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. అదేవిధంగా కార్వేటినగరం పంచాయతీ పద్మ సరస్సు జగనన్న లేఅవుట్ వద్ద సిమెంట్ రోడ్డు నిర్మాణానికి 36 లక్షలతో భూమి పూజ నిర్వహించారు. అలాగే సెట్టిగుంట యానాది కాలనీలో 18 లక్షలతో నిర్మించనున్న సిమెంట్‌రోడ్డుకు భూమి పూజ చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే థామస్ మాట్లాడుతూ మొదటి విడతగా నియోజకవర్గంలో 12 కోట్లతో సిమెంట్ రోడ్లు, వీటి రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యిందని వాటిని ఐక్యమత్యంతో ఉండి పనులు పూర్తి చేయాలని సూచించారు. పల్లె పండగ ప్రగతికి అండగా పంచాయతీ వారోత్సవాలు 14 నుండి 20 తేదీ వరకు జరుగుతుందన్నారు. మండలంలో 32 పనులకు గాను దాదాపుగా మూడు కోట్ల రూపాయలు మంజూరు అయిందన్నారు. వీటిని త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణ రోడ్లకు మహర్దశ రావడం ఓ వరమని ఎంపీడీవో చంద్రమౌళి అన్నారు. టిడిపి కార్యకర్తలు నాయకులు ఎమ్మెల్యే థామస్‌కు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు చెంగలరాయల్ యాదవ్, జీడి నెల్లూరు జనసేన ఇంచార్జ్ పొన్న యుగంధర్, పిఆర్ డిఈ ఆనంద్ రెడ్డి, తహసీల్దార్ భగవతి, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ గిరీష్, ఈవో నాగరత్నమ్మ, ఏఈ దినేష్, మనోజ్ కుమార్, టిడిపి నాయకులు సోమశేఖర్ యాదవ్, సోము, రాజా, వినోద్ కుమార్, రాంబాబు రెడ్డి, దాము తదితరులు పాల్గొన్నారు.

మండలప్రజలు అప్రమత్తంగా ఉండాలి: తహసీల్దార్ శ్రీనివాసులు

విశాలాంధ్ర-చిల్లకూరు: ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వలన తిరుపతి జిల్లా అంతటా విస్తారంగా మరియు భారీగా వర్షాలు పడనున్న విషయం వాతావరణ శాఖ వారు తెలియపరచడంతో, తహసీల్దారు శ్రీనివాసులు మండల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మత్స్యకారులు చేపల వేటకోసం సముద్రం లోకి వెళ్ళరాదని, భారీ వర్షాలకు పొంగే వాగులు, కాల్వలు, కల్వర్టులు, మ్యాన్ హోల్సుకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. విద్యుత్ స్థంభాలు, తెగిపడిన తీగలు, చెట్లు, శిధిల భవనాలకు దూరంగా ఉండాలని తెలిపారు. వర్షాలతో పాటూ ఉరుములతో కూడిన పిడుగులు పడే అవకాశాలు ఉన్నాయని పొలాలలో పనిచేసే రైతులు, కూలీలు, పశువుల, మేకల మరియు గొర్రెల కాపరులు చెట్లు, టవర్లు, బహిరంగ ప్రదేశాలలో ఉండకుండా సురక్షిత ప్రాంతాలలో ఉండాలని కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో 24/7 పనిచేసే కంట్రోల్ రూము ఏర్పాటు చేసినట్లు తహశీల్దార్ తెలిపారు.

రెవెన్యూ, పోలీస్ సిబ్బంది అప్రమత్తం

విశాలాంధ్ర-పెళ్లకూరు: మండలంలో సోమవారం భారీ వర్షాలు, తుఫాను నేపథ్యంలో నాయుడుపేట డి.ఎస్.పి. చెంచు బాబు, పెళ్లకూరు మండల ఎస్సై నాగరాజు వారి సిబ్బందితో కలిసి కప్ప గుంట కండ్రిగ వద్ద ఉన్న వంతెనను, కలవకూరు, ముమ్మారెడ్డి గుంట, పుల్లూరు మధ్యలో ఉన్న కల్వర్టును పరిశీలించారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ ఈరోజు వర్షం తీవ్రత ఎక్కువగా లేనప్పటికీ ప్రస్తుతం వర్షం ఎక్కువగా అయినట్లయితే నీటిమట్టం పెరిగి ప్రవాహం పెరుగుతుంది. ప్రవాహ వేగం ఎక్కువైతే ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రజలు ఇబ్బంది పడకుండా వేరే దారిలో ప్రయాణ సౌకర్యాలు కలగ చేస్తామని తెలియజేశారు.

ముప్పాళ్ల జన్మదిన సంబురాలు

విశాలాంధ్ర-సూళ్లూరుపేట: సూళ్లూరుపేటకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయం మాజీ చైర్మన్, పేదల పాలిట పెన్నిధి ముప్పాళ్ల వెంకటేశ్వర్ రెడ్డి జన్మదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు అందరు కలిసి స్థానిక బస్టాండ్ సెంటర్లో పేదలకు అన్నదానం చేశారు. పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఆకుతోట రమేష్ సహాయ సహకారాలతో జరిగిన ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు మేడా సాయి, తెలుగుదేశం పార్టీ నేతలు దంతాల రవి, మైనారిటీ నాయకులు అలీ భాయ్, కొమరంజేరి శ్రీధర్, శంకరయ్య, దొడ్డి మస్తాన్, గిరి మరియు ముని రామయ్య, పట్టు చరణ్ యాదవ్, ఎర్రబోతు ప్రశాంత్, మణికంఠ, ఇమ్రాన్, సాయి తేజ, హర్ష, అజయ్, ప్రేమ్ తదితరులు పాల్గొనడం జరిగింది.

మరమ్మతులకు నోచుకోని చెరువు - కుంగిన చెరువు కట్ట

పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు

విశాలాంధ్ర-బుచ్చినాయుడు కండ్రిగ: వరదయ్యపాలెం మండలంలో అతిపెద్ద చెరువు అయినా సంత వేలూరు గ్రామ చెరువు గత 10 సంవత్సరాలుగా మరమ్మతులకు నోచుకోకపోవడంతో చెరువు కట్ట బలహీనపడి గండి పడే స్థితిలో ఉన్నది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రాష్ట్రస్థాయి అధికారి యంత్రాంగం చెరువులు బలహీన తలను పరిశీలించి మరమ్మతులు చేపట్టాలని సోమవారం అధికారులకు ఆదేశించినప్పటికీ, మండలంలోని సంత వేలూరు గ్రామ పంచాయతీ ఇరిగేషన్ అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులు వీధినపడే దుస్థితి ఏర్పడుతున్నది. ఈ చెరువు విస్తీర్ణం రెండు వేల ఎకరాల వరకు ఉంటుందని సమాచారం, చెరువు ఆయకట్ట కింద సుమారు 5000 హెక్టార్లు వ్యవసాయం రైతులు కొనసాగిస్తున్నారు, ఈ ఆయకట్ట క్రింద అనేకమైన గ్రామాలు రైతులు వ్యవసాయం కొనసాగిస్తున్నారు. గత సంవత్సరం కురిసిన వర్షాలకు చెరువు తెగిపోయే దుస్థితి ఉండడంతో అధికారులు దృష్టికి రైతులు తీసుకుపోయినప్పటికీ ఇరిగేషన్ అధికారులు నిర్లక్ష్య వైఖరితో వ్యవహరించడం వల్ల నేటి వర్షాలకు తెగిపోయే అవకాశాలు మెండుగా ఉన్నాయి. మండల స్థాయి అధికారులు చెరువుని పరిశీలించిన దాఖలాలు ఎన్నటికీ లేవు, ప్రజా ప్రతినిధులు అధికారులు దృష్టికి తీసుకువెళ్లి స్పందించిన దాఖలాలు లేవు, చెరువు ద్వారా లభించే ఆదాయం వనరులపై అనేకమంది పెత్తనం చెలాయిస్తారే కానీ, చెరువును బలోపేతం చేయడానికి ఎవరు ముందుకు రావడం లేదు, గత నవంబర్ మాసంలో కురిసిన వర్షాలకు అధికారులు వద్దకు రాత్రి అనక పగలనక కాళ్లు అరిగేలా తిరిగినప్పటికీ, స్పందించకపోవడం శోచనీయం, అధికారులు స్పందించకపోతే ఈ ఏడాది వ్యవసాయం కొనసాగించలేని స్థితి, వ్యవసాయం ద్వారా జీవనం కొనసాగించే కుటుంబాలు వీధిన పడే అవకాశాలు మెండుగా ఉన్నాయి. జిల్లా ఇరిగేషన్ యంత్రాంగం స్పందించి చెరువుకు మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఎంతో ఉంది.

వైభవోపేతంగా రాజరాజేశ్వరి దేవి కళ్యాణం

విశాలాంధ్ర-రామచంద్రాపురం: మండలంలోని సొరవారిపల్లి గొల్లపల్లిలో ఉన్న సురభి గో సంరక్షణ శాలలో ఏకవీర సేవ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ప్రతాప్ స్వామి చేతుల మీదుగా రాజరాజేశ్వరి దేవి కళ్యాణాన్ని శనివారం వైభవోపేతంగా నిర్వహించారు. అమ్మవారి కళ్యాణానికి ఉభయ దాతలుగా తిమ్మరాజు పల్లికి చెందిన సీనియర్ అడ్వకేట్, సామాజిక సమరసత వేదిక తిరుపతి జిల్లా అధ్యక్షులు మోమిడి లీలా కృష్ణ, మాజీ యంపిటీసి శ్రీ దేవీ దంపతులు వ్యవహరించారు. ప్రతాప్ స్వామి ఆధ్వర్యంలో అర్చకులు అమ్మవారిని వేకువజామున నిద్రను మేల్కొలిపి ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక వాహనంలో ఉంచి తిమ్మరాజు పల్లి రేణుకాపురం ఆముదాలపల్లి గొల్లపల్లి రెడ్డివారి పల్లి స్వరావారిపల్లి గ్రామాలలో అమ్మవారిని ఊరేగించారు. సురభి గోసమరక్షణ సేవలో ఏర్పాటుచేసిన కళ్యాణ వేదిక పైకి మంగళ వాయిద్యాల మధ్య వేంచేపుగా తీసుకొని వచ్చారు. శాస్త్రోక్తంగా వేదమంత్రాల పఠనంతో కళ్యాణ తంతు ఘనంగా నిర్వహించారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులందరికీ ఉభయ దాతలు తీర్ధ ప్రసాదాలతో పాటు, పసుపు,కుంకుమ, పూలు, పండ్లు అందించారు. మధ్యాహ్నం భారీ ఎత్తున అన్న ప్రసాద వితరణ చేశారు. అనంతరం ప్రతాప్ స్వామి రాజరాజేశ్వరి దేవి కథవృత్తాంతాన్ని కల్యాణ ఉత్సవం యొక్క ప్రాముఖ్యతని చక్కగా వివరించారు. తొమ్మిది రోజులపాటు అమ్మవారి నవరాత్రి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించడానికి సహాయ సహకారాలు అందించిన వారందరికీ ఏకదరసేవ ఫౌండేషన్ ద్వారా గౌరవ సత్కారం చేశారు.

భారీ వర్షాలకు అప్రమత్తంగా ఉండాలి

- తహసీల్దార్ అరుణ కుమారి

విశాలాంధ్ర-పాలసముద్రం: బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ద్రోణి ప్రభావంతో రానున్న మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకావం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తాసిల్దార్ అరుణ కుమారి అన్నారు. స్థానిక మండల తాసిల్దార్ కార్యాలయంలో సోమవారం జిల్లా కలెక్టర్ ఆదేశాలతో విఆర్ఓలతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారీ వర్షాలు కురిస్తే ఏ విధంగా ఎదుర్కొవాలో వీఆర్వోలకు సూచించారు. గ్రామస్థాయి లో అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు మహిళా సంఘాల సమన్వయంతో ముందస్తు కార్యాచరణ ప్రణాళిక తయారు చేసుకోవాలన్నారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. అనంతరం మండలంలో ఉన్న వనదుర్గాపురం ఎస్టీ కాలనీ, పాలసముద్రం పంచాయతీ మణిపురం ఎస్టి కాలనీ పర్యటించి భారీ వర్షాల కారణంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో పూరెలను వదిలి సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని లేదా తుఫాన్ షెల్టర్లు పెట్టడం జరిగింది. వాటిల్లో నీటి సౌకర్యం, విద్యుత్ సరఫరా ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, దివ్యాంగులు, రోగాలతో బాధపడే వారి జాబితా సేకరించి ఇవ్వాలని, మండలం ఇంకా ఎక్కడైనా పూరిళ్లు, మట్టి ఇళ్లు శిథిలావస్థలో ఉంటే వాటిలో నివసించే వారి వివరాలను సేకరించి వెంటనే చర్యలు తీసుకోని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని తెలిపారు. అత్యవసర సమయాల్లో ఉపయోగించడానికి అవసరమయ్యే టార్చ్ లైట్, కొవ్వొత్తులు, తాగునీరు, చిన్న పిల్లలకు అవసరమయ్యే పాలు, నిత్యావసరాలు ప్రజలు ముందుగానే ఇళ్లల్లో తెచ్చి పెట్టుకోవాలని సూచించారు. అలాగే ఏదైనా అత్యవసర పరిస్థితులు తలెత్తితే వెంటనే 94910 77033 ఈ నెంబర్‌కి కాల్ చేయాలని తాసిల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ కూడా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు సర్వేయర్ గణేష్, వీఆర్వోలు శ్రీనివాసులు, పవన్ కుమార్, సాదు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా

పట్టుదలతో వైద్య విద్యను అభ్యసించాలి

స్విమ్స్ సంచాలకులు మరియు ఉపకులపతి డా. ఆర్.వి. కుమార్ హితబోధ

విశాలాంధ్ర-తిరుపతి: శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్)కు అనుబంధంగా ఉన్న శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల నందు సోమవారం ఉదయం 10 గంటలకు యం.బి.బి.ఎస్. 2024-25 (విద్యా సంవత్సరానికి) అడ్మిషన్ పొందిన విద్యార్థినులు మరియు వారి తల్లిదండ్రులకు వైద్య కళాశాల నందు బోధనా పద్ధతులపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డా.రామ్ తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా స్విమ్స్ సంచాలకులు మరియు ఉపకులపతి డా. ఆర్.వి. కుమార్ విచ్చేశారు. డీన్ డా. అల్లాడి మోహన్, రిజిస్ట్రార్ డా. అపర్ణ బిట్లా. శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా. ఉషా కళావత్, వైస్ ప్రిన్సిపల్స్ డా. నాగరాజు, డా.ముక్తేశ్వరయ్య, కలిసి సంయుక్తంగా జ్యోతిని వెలింగించి ప్రారంభించారు. స్విమ్స్ సంచాలకులు మరియు ఉపకులపతి డా. ఆర్.వి. కుమార్ మాట్లాడుతూ... విద్యార్థినులకు శుభాకాంక్షలు తెలుపుతూ విద్యార్థులు ఎంతో కష్టపడి చదివి మెడికల్ సీట్లను పొందారని, తల్లిదండ్రులు అభీష్టం మేరకు నాణ్యమైన వైద్యవిద్యను అభ్యసించి, వృత్తిలో రాణించి రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించి ఆరోగ్య సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. స్విమ్స్ యూనివర్శిటీకి సంబంధించిన సమాచారాన్ని ఇదివరకే స్విమ్స్ వెబ్ సైట్ నందు అందుబాటులో ఉంచినట్లు పేర్కొంటూ, స్విమ్స్ ను ర్యాగింగ్ ఫ్రీ జోన్‌గా పేర్కొన్నారు. విద్యార్థులు కేవలం విద్యను మాత్రమే కాకుండా వ్యక్తిత్వ వికాసం పై దృష్టి కేంద్రీకరించి శారీరకంగా, మానసికంగా, ఆధ్యాత్మికంగా దృఢత్వాన్ని పెంపొందించుకోవాలన్నారు. స్విమ్స్ నందు వైద్య విద్య అందించడంలో ఎల్లవేళలా నూతన ఆలోచనలకు ప్రోత్సాహం అందిస్తామని తెలియజేశారు. వైద్య వృత్తిలో ప్రవేశించిన తరువాత రోగులకు ప్రత్యేకించి పేదలకు విశిష్ట సేవలు అందించి స్విమ్స్ ప్రతిష్ట ఇనుమడింప చేయాలని సూచించారు. స్విమ్స్ డీన్ డా.అల్లాడి మోహన్ మాట్లాడుతూ... వైద్య వృత్తి ఎంతో మహోన్నతమైనది "వైద్యో నారాయణ హరి:" అన్న వేదోక్తి మేరకు వైద్యులు ప్రత్యక్ష దేవుడితో సమానమని పేర్కొన్నారు. వైద్య విద్యను అభ్యసించడంలో ఎటువంటి భయాందోళనలకు లోనుకాకుండా, ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా ఉండి వైద్యవిద్యను విజయవంతంగా పూర్తి చేయాలన్నారు.శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా.ఉషా కళావత్ విద్యార్థినిలను ఉద్దేశించి ప్రసంగిస్తూ విద్యార్థినీలు క్రమశిక్షణతో తమ విద్యాభ్యాసాన్ని పూర్తి చేయాలని ఎటువంటి ఒత్తిడులకు లోను కాకుండా ఉత్సహంతో విద్యాభ్యాసాన్ని పూర్తి చేయాలని తెలిపారు. విద్యార్థినీలు ఎప్పుడైనా సరే ఎటువంటి సమస్యలైనా తన దృష్టికి తీసుకుని రావడం ద్వారా తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చు నన్నారు.తదనంతరం నూతనంగా విచ్చేసిన విద్యార్థినీల పరిచయ కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థినీలకు స్విమ్స్ సంచాలకులు మరియు ఉపకులపతి డా. ఆర్.వి.కుమార్ చేతుల మీదుగా ఎప్రాన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డా. ఉమామహేశ్వరరావు డా. శ్రీకాంత్, డిప్యూటీ రిజిస్ట్రార్ యర్రంరెడ్డి, మెడికల్ కాలేజ్ వైద్యులు, అసిస్టెంట్ డైరెక్టర్ శశికళ, సూపరింటెండెంట్ ధనలక్ష్మి, సిబ్బంది, విద్యార్థినులు మరియు విద్యార్థినుల తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

పల్లె పండుగతో అభివృద్ధికి బాటలు: ఎమ్మెల్యే జగన్ మోహన్

విశాలాంధ్ర-చిత్తూరు: గ్రామాల అభివృద్దే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన పల్లె పండుగ కార్యక్రమంతో పల్లెల్లో అభివృద్ధికి బాటలు పరుచుకున్నాయని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మార్గనిర్దేశంలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా సోమవారం చిత్తూరు రూరల్ మండలం అనంతాపురం, ఆనగల్లు, పాలూరు, ముత్తుకూరు, తాళంబేడు క్రాస్ గ్రామాల్లో పల్లెపండుగ - పంచాయతీ వారోత్సవాలలో భాగంగా పలు అభివృద్ధి ఉపాధి పనులకు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడచిన కొన్నేళ్లుగా గ్రామాల్లో అభివృద్ధి పనులు నిలిచిపోయాయని. పల్లె ప్రజలకు మౌలిక వసతులు కరువయ్యాయన్నారు. పల్లెలను తిరిగి అభివృద్ధి బాట పట్టించేందుకు, పల్లె ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. ఇందులో భాగంగానే పల్లె పండుగపేరుతో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేశామని ప్రతి ఆరు నెలలకు ఒకసారి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడతామన్నారు. గ్రామాల అభివృద్ధి తెదేపా, కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. ఐదు గ్రామాల పరిధిలో రూ.60 లక్షలు విలువైన 9 సిమెంట్ రోడ్ల పనులకు భూమి పూజ నిర్వహించారు. ఎన్నికల హామీల మేరకు ఉచిత గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్ దీపావళి నుంచి అమలు చేస్తామని చెప్పారు. స్థానికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తెదేపా చిత్తూరు జిల్లా మాజీ ఉపాధ్యక్షులు చంద్ర ప్రకాష్, రూరల్ మండలం మాజీ ఎంపిపి జయచంద్ర నాయుడు, తెదేపా జిల్లా కార్యాలయ కార్యదర్శి మోహన్ రాజ్, తెదేపా నాయకులు జగదీశ్వర్ నాయుడు, మండల అధ్యక్షులు శశికర్ బాబు, ముత్తుకూరు మోహన్, మేషాక్, రఘు, కుమార్, ఉమ్మడి పార్టీల నాయకులు, కార్యకర్తలు, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలు నాలుగు ముఖ ద్వారాలకు బయట ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి క్షేత్ర పవిత్రతను దృష్టిలో ఉంచుకుని మద్యం దుకాణాలు నాలుగు ముఖ ద్వారాలకు బయట ఏర్పాటు చేయాలని జైబీమ్ ఆర్మీ వ్యవస్థాపకులు పులి శ్రీకాంత్ డిమాండు చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. శ్రీకాళహస్తీశ్వరస్వామి దర్శనం కోసం నిత్యం వేలాది మంది శ్రీకాళహస్తికి వస్తుంటారన్నారు. ఈ నేపథ్యంలో పుణ్యక్షేత్ర పవిత్రత కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. పుణ్యక్షేత్రంలో మద్యం దుకాణాలు ఉండకూడదని పులి శ్రీకాంత్ అభిప్రాయపడ్డారు. తిరుపతి తిరుమల దేవస్థానం ఆధ్యాత్మిక భక్తి భావంతో ఓం నమో వెంకటేశాయ... ఓం నమో వెంకటేశాయ నామస్మరణంతో ముందుకు సాగుతోందన్నారు. అదేవిధంగా శ్రీకాళహస్తి పట్టణంలో కూడా మద్యం దుకాణాలు నిషేధించి ముఖ ద్వారాలకు వెలుపల నెలకొల్పవలసిన బాధ్యత ప్రభుత్వాల మీద ఉందన్నారు. భక్తులు దిగే చోట... బస్టాండ్‌కి నలుమూలల మద్యం షాపులు ఉండడం వలన ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. మద్యం సేవించిన వారు కొందరు భక్తుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారన్నారు. ఇక శ్రీ సిటీకి పోయే మహిళలకు రక్షణ లేకుండా పోతోందన్నారు. బస్టాండు సమీపంలోని ఓ బారు వద్ద నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందని పులి శ్రీకాంత్ తెలిపారు. కనీసం 108 వాహనాల పోవుటకు కూడా దారి ఇవ్వడం లేదన్నారు. ఈ బార్ సమీపంలోనే గవర్నమెంట్ జూనియర్ కళాశాల, గవర్నమెంట్ హాస్పిటల్, అన్నా



క్యాంటీన్, స్టూడెంట్ హాస్టల్స్ ఉన్నాయన్నారు. బాలికల కళాశాలకు ఇదే మార్గంలో వెళ్లాల్సి ఉన్నందున వారు ఇబ్బందులు పడుతున్నారి పులి శ్రీకాంత్ పేర్కొన్నారు. బీపీ అగ్రహారం వద్ద ఉన్న బార్ వద్ద కూడా ఇదే పరిస్థితి ఉందన్నారు. అధికారులు ఇకనైనా స్పందించి మద్యం దుకాణాలు, బార్లు ఏర్పాటుపై సరైన నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు.

అత్తమామలపై అల్లుడు దాడి

విశాలాంధ్ర-గూడూరు: గూడూరు పట్టణం లోని గాంధీనగర్ ప్రాంతంలోని ఇందిరమ్మ కాలనీలోని దారుణం చోటుచేసుకుంది. గూడూరు రెండో పట్టణ పోలీస్ లు కథనం మేరకు ఆర్థిక లావాదేవీల విషయంలో వివాదం ఏర్పడడంతో పిల్లని ఇచ్చిన అత్త మామలపై అల్లుడు సుబ్రహ్మణ్యం అతని బంధువులతో కలసి దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో కృష్ణయ్య. ధనమ్మలు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నెల్లూరు ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అనంతరం ఘటన స్థలన్ని చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఘనంగా పల్లె పండుగ

విశాలాంధ్ర-రేణిగుంట: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా రేణిగుంట మండలం తూకివాకం పంచాయతీ గంగానగర్లో సోమవారం స్థానిక టిడిపి నాయకులు మాజీ సర్పంచ్ భాస్కర్ యాదవ్, నాగ సుబ్రహ్మణ్యం రెడ్డి నూతన సిమెంట్ రోడ్డుకు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా రోడ్డు లేకుండా గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో గంగానగర్ ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని అన్నారు. నూతనంగా ఎనిమిది లక్షల అంచనాతో సిమెంట్ రోడ్డు పనులను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వం మనది అని నిరూపించుకున్నారని తెలిపారు. గంగానగర్ ప్రజల తరపున ఎమ్మెల్యే సుధీర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బాలాజీ, టిడిపి నాయకులు మోహన్, సి.వి.సుబ్బయ్య, నాగరాజు, కృష్ణ రవిచంద్ర, రామదాస్, గోపి, వెంకటయ్య, సుబ్రహ్మణ్యం, వనమ్మ, వర కుమార్, మోహన్, శ్రీనివాసులు, సురేంద్ర, కుమార్ వెలు, టెక్నికల్ అసిస్టెంట్ మల్లేశ్వరి, ఈజీఎస్ జయంతి ఫీల్డ్ అసిస్టెంట్ సుభాషిణి, తదితరులు పాల్గొన్నారు.

చెరువులకు మరమ్మతులు - అప్రమత్తమైన అధికారులు

విశాలాంధ్ర-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలో బలహీన ముగా ఉన్న చెరువులను బలోపేతం చేయడానికి అధికారులు ఆదేశించిన ఆదేశాలను గ్రామస్థాయిలో ఆయా పంచాయతీ అధికారులు సోమవారం చెరువులను బలోపేతం చేయడానికి మరమ్మత్తులు చేపడుతున్నారు. గాజుల పెళ్లూరు గ్రామంలో గత సంవత్సరం నవంబర్ లో కురిసిన భారీ వర్షాలకు గండిపడటంతో తాత్కాలికంగా చేసిన పనులుకు చెరువు కట్ట బలహీనంగా ఉన్నది. నేడు కురుస్తున్న వర్షాలకు బలహీనంగా ఉన్న ప్రాంతాన్ని టీడీపీ రైతు సంఘం నాయకుడు భాస్కర్ యాదవ్ అధికారి ఆదేశాలతో సుమారు 20.000 రూపాయల వ్యయంతో 700 ఇసుక మూటలు తో మరమ్మతులు చేపట్టారు, అదే కట్టకి జెసిపి అంతరాలాతో గండి పూచే పనులు చేపట్టారు, కురుస్తున్న వర్షానికి వర్షపు నీరు చెరువుకు చేరడంతో చెరువు కట్టను రైతులందరూ బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నారు. ఇరిగేషన్ ఏ ఈ అస్లాం కారణి గ్రామ చెరువు కట్ట పనులు మరమ్మతులు చేపట్టారు, కరకంబట్టు పంట కాలువ పనులు మరమ్మత్తులు చేపట్టారు, జిల్లా అధికారుల ఆదేశాలతో చెరువు కట్టలు కాలువ కట్టలు, వాగులు వంకలు, పరిశీలిస్తూ అవసరమైన మేరకు చర్యలు చేపడుతున్నారు. సంబంధించిన అధికారులు పర్యవేక్షణలో నిమగ్నమై ఉన్నారు.

పల్లె పండుగలతో గ్రామాల అభివృద్ధి

గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్

విశాలాంధ్ర-గూడూరు: పల్లె పండుగ – ప్రగతికి అండగా కార్యక్రమం ద్వారా నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధికి శ్రీకారం చుట్టడం జరిగిందని గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ తెలిపారు. గూడూరు మండల పరిధిలోని కొండగుంట గ్రామంలో సిసి డ్రైనేజ్ కాలువల నిర్మాణానికి గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు.అదేవిధంగా మండల పరిధిలోని వెంకటేసు పల్లెల్లో 10 లక్షలు నిధులతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఎన్.డి.ఏ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించింది ఈ క్రమంలో గత ఆగస్టు నెలలో గ్రామ సభలు నిర్వహించి గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను నిర్ణయించడం జరిగింది. గ్రామ సభల్లో ఎంపిక చేసిన అభివృద్ధి పనులను పల్లె పండుగ కార్యక్రమం ద్వారా ప్రారంభోత్సవ కార్యక్రమాలు స్థానిక ఎమ్మెల్యేల ద్వారా సోమవారం ప్రారంభించారు. అక్టోబర్ 14వ తేదీ నుండి పల్లె పండుగ – ప్రగతికి అండగా పంచాయతీ వారోత్సవాలు రాష్ట్రంలో ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే వారోత్సవాల్లో భాగంగా ప్రతి మండల పరిధిలో మూడు గ్రామాలలో అభివృద్ధి కార్యక్రమాలను స్వయంగా ప్రారంభించే విధంగా కార్యక్రమం రూపొందించారు. ఈ క్రమంలో గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ గూడూరు మండల పరిధిలోని కొండగుంట గ్రామంలో అరుంధతి వాడలో పది లక్షల రూపాయల నిధులతో సీసీ డ్రైనేజీ కాలువల నిర్మాణానికి ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి గ్రామసభలు ద్వారా ఎంపిక చేసిన పనులను ప్రారంభించి నిర్ణయిత గడువులోగా వాటిని పూర్తి చేసే విధంగా పల్లె పండుగ కార్యక్రమం రూపొందించడం జరిగిందని తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడం జరుగుతుందని పేర్కొన్నారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రులలో వైద్య సేవలు పొందుతున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి నిధులు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని అవసరమైన వారు గూడూరు ఎమ్మెల్యే కార్యాలయాన్ని, స్థానిక నాయకులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం జనసేన, బిజెపి నాయకులు వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

దాసుకుప్పంలో పల్లె పండుగ వారోత్సవాలు ప్రారంభం

విశాలాంధ్ర-సత్యవేడు: మండలంలో పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా తొలి రోజు దాసుకుప్పం గ్రామంలో సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ హేమమాలిని పర్యవేక్షణలో సిమెంటు రోడ్డు నిర్మాణానికి టిడిపి జిల్లా పరిషత్తు మాజీ వైస్ చైర్మన్ సుందర్ రామిరెడ్డి, లోకయ్య రెడ్డి సంయుక్తంగా సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి కొబ్బరికాయలు కొట్టిన తర్వాత సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేయడం జరిగింది. ఈ సందర్భంగా టిడిపి సీనియర్ నాయకుడు లోకయ్య రెడ్డి మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ సంపదను సృష్టించడం ద్వారా పంచాయతీ అభివృద్ధిని సాధించాలన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం పల్లె పండుగకు శ్రీకారం చుట్టిందన్నారు. ఈ పంచాయతీ వారోత్సవాల్లో ముఖ్యంగా సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు, పశువుల షెడ్లు వంటి పనులను చేపట్టడంలో ప్రాధాన్యత ఉంటుందన్నారు.కాగా కాలువ గట్టు వద్ద దాదాపు 400 మీటర్ల మేరా 15 లక్షల రూపాయల నిధులతో సిమెంటు రోడ్డు నిర్మాణం జరుగుతుందని పంచాయతీ సెక్రటరీ రమణమూర్తి వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు జగన్నాథం, గ్రామస్తులు పాల్గొన్నారు.

చినుకు రాలితే 'మురికి'

కాలువల ఆక్రమణతో రోడ్లు అధ్వానం

రైల్వే స్టేషన్ ఎదుట యాత్రికులకు తప్పని తిప్పలు

విశాలాంధ్ర-రేణిగుంట: మండల కేంద్రమైన రేణిగుంట మేజర్ పంచాయతీ అభివృద్ధిలో మాత్రం శూన్యం అనే చెప్పాలి. చినుకు పడితే చాలు డ్రైనేజీ లోని మురికి నీళ్ళు అంతా రోడ్ల పైకి రావడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ అధికారులకు మాత్రం ఎన్ని సార్లు విన్నవించుకున్నా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలకు తావిస్తుంది. ముఖ్యంగా నిత్యం కిటకిట లాడుతున్న బజారు వీధి, రైల్వేస్టేషన్ వీధులలో అయితే యాత్రికులకు తప్పని తిప్పలు అనే చెప్పాలి. ఈ రోడ్ల పై నడవాలంటే ముక్కున వేలేసుకోవలసిన పరిస్థితి ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చేయవలసిందిగా కోరుతున్నారు.

గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమం ప్రారంభం

విశాలాంధ్ర-సోమల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పండుగ కార్యక్రమంలో తమ్మినేని వారి పల్లి గ్రామపంచాయతీ పేగలవారి పల్లిలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేసి ప్రారంభించారు. కందూరు గ్రామపంచాయతీలో కందూరు, మిట్టపల్లి నందు సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. అధికారులు మాట్లాడుతూ.. పల్లె పండుగ ద్వారా రోడ్డు వేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆక్స్‌ఫర్డ్ డిగ్రీ కళాశాల విద్యార్థుల ర్యాంకుల ప్రభంజనం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: ఎస్వీయూనివర్సిటీ విడుదల చేసిన డిగ్రీ 4వ సెమిస్టరు ఫలితాలలో ఆక్స్‌ఫర్డ్ కళాశాల విద్యార్థులు పట్టణ, యూనివర్సిటీ స్థాయిలలో అన్ని గ్రూపులలో అగ్రస్థానాలను కైవసం చేసుకున్నట్లు కళాశాల కరస్పాండెంట్ సి మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ బి.ఎస్సీ (యం.ఎస్.సీ.యస్) గ్రూపులో సి.సింధు (9.43), జె.పూజిత (8.20), సి.జ్యోతీష్ (8.13), బి.ఎస్సీ (యం.పీ.సీ.యస్) గ్రూపులో ఎస్ నాగలక్ష్మి (8.09), డి.సాయి శిరీష(7.59), టి.సుప్రియ (7.25) బి.ఎస్సీ(బయోటెక్నాలజీ) గ్రూపులో కె.యోగేశ్వరి (8.81), టి.ప్రేమ్ కుమార్ (8.13), కె.కల్పన(7.43) పాయింట్లతో యూనివర్సిటీ స్థాయిలో వరుసగా ప్రథమ ద్వితీయ, తృతీయస్థానాన్ని కైవసం చేసుకున్నారని తెలిపారు. అలాగే బి.కామ్ (సి.ఏ) గ్రూపునందు కె హిమ (8.97), ఎస్.కె.మోహసీనా (8.91), పి.లలిత కుమారి (8.84), పాయింట్లతో పట్టణ, యూనివర్సిటీ స్థాయిలో వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా జరిగిన అభినందన కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సి.మధుసూదన్ రెడ్డి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని విద్యార్థులను అభినందించారు.

తిరుమలకు భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

– అధికారులతో టీటీడీ ఈఓ జె.శ్యామల రావు

విశాలాంధ్ర - తిరుమల కల్చరల్ : తిరుపతికి భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని టీటీడీ ఈఓ జె.శ్యామల రావు ఆదేశించారు. విపత్తు నిర్వహణ ప్రణాళికపై టీటీడీ అడిషనల్ ఈఓ సి.హెచ్.వెంకయ్య చౌదరితో కలిసి ఆయన అధికారులతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ 48 గంటల్లో తిరుపతిలో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందనే వాతావరణశాఖ ముందస్తు హెచ్చరికల నేపథ్యంలో అధికారులందరూ విపత్తును ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండాలని కోరారు. 2021లో భారీ కొండ చరియలు విరిగి పడిన ఘటనతో టీటీడీ 700 పేజీల విపత్తు నిర్వహణ ప్రణాళిక రూపొందించిందన్నారు. ఈ ప్రణాళిక బాగుందనీ, మరింత మెరుగు పరచాల్సిన అవసరం ఉందని అధికారులకు సూచించారు. ఈఓ స్థాయిలో విపత్తుల నివారణ ఎగ్జిక్యూటివ్ కమిటీ, అడిషనల్ ఈఓ ఆధ్వర్యంలో విపత్తు నిర్వహణ సమన్వయ కమిటీ ఉందన్నారు. అగ్నిమాపక శాఖ, ఆరోగ్య శాఖ, విజిలెన్స్ విభాగం, ఇతర కీలకమైన శాఖల విభాగాధిపతులు, తమ సిబ్బందితో డిజాస్టర్ మేనేజ్మెంట్ రెస్పాన్స్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.కొండ చరియలపై ప్రత్యేక నిఘా ఉంచాలనీ, ఘాట్ రోడ్లలో ట్రాఫిక్ జామ్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ కు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్ శాఖ విద్యుత్తు అంతరాయ పరిస్థితిల్లో జనరేటర్లు నడపడానికి ముందస్తు జాగ్రత్తగా తగినంత డీజిల్ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఐటీ విభాగం భక్తులకు వసతి, దర్శనం, ప్రసాదాల కార్యాకలాపాలకు ఆటంకం కలగకుండా ప్రత్యామ్నాయం ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. విపత్కర పరిస్థితులను ఎదుర్కొనే చర్యల్లో భాగంగా వైద్య శాఖ అంబులెన్సు లను అందుబాటులో పెట్టుకుని అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంజనీరింగ్ విభాగం డ్యామ్ గేట్లను పర్యవేక్షించాలనీ, ఘాట్ రోడ్డులలో జేసీబీ, ట్రక్కులు, ట్రాక్టర్లు తగిన సిబ్బందిని సంసిద్ధంగా ఉంచుకుని సమాయత్తంగా ఉండా లని చెప్పారు. ట్రాఫిక్ పోలీసులు ఇంజినీరింగ్ సిబ్బందితో సమన్వయం చేసుకుని పని చేయాలన్నారు. ఏదైనా విపత్కర పరిస్థితి ఎదురైతే అగ్ని మాపక సిబ్బంది వేగంగా స్పందించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ప్రజా సంబంధాల విభాగం వాతావరణ సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఎస్వీబీసీ, మీడియా, టీటీడీ సోషియల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేస్తూ భక్తులను అప్రమత్తం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో టీటీడీ జేఈఓలు గౌతమి, వీరబ్రహ్మం, సీవీఎస్వో శ్రీధర్, సిఈ సత్య నారాయణ, ఇతర విభాగాధిపతులు, జిల్లా పోలీసు మరియు రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో ప్రశాంతంగా లాటరీ పద్ధతిలో

మద్యం షాపులు కేటాయింపు

– భారీ బందోబస్తు మధ్య ప్రక్రియ పూర్తి

విశాలాంధ్ర –చిత్తూరు : జిల్లా లో ప్రభుత్వ నూతన మద్యం విధానం లో భాగంగా మద్యం దుకాణాలను పారదర్శకంగా ప్రశాంతంగా లాటరీ పద్ధతి లో కేటాయింపు ప్రకియ పూర్తి చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. సోమవారం చిత్తూరు జిల్లా కేంద్రంలో ఆర్ ఆర్ ఫంక్షన్ హాల్ నందు మద్యం దుకాణాల కేటాయింపు ప్రక్రియ లాటరీ పద్దతి లో ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం 8 గంటల ప్రారంభమైన లాటరీ ప్రక్రియను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్,జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆధ్వర్యం లో ప్రశాంతంగా నిర్వహించిన దుకాణాల కేటాయింపు ప్రక్రియ మధ్యాహ్నం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రశాంతంగా, పారదర్శం గా మద్యం దుకాణాల కేటాయింపు లాటరీ ప్రక్రియ పూర్తయినట్లు,ఈ ప్రక్రియ ను పూర్తి గా వీడియో గ్రాఫర్లతో వీడియోగ్రఫి చిత్రీకరించినట్లు తెలిపారు. ఆయా షాపులకు టెండర్లు దాఖలు చేసిన దరఖాస్తు దారుల సమక్షంలోనే లక్కీడిప్ తీసి షాపు దక్కించుకున్న వారి పేరును ప్రకటించినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 104 మద్యం దుకాణాలకు 2,266 మంది టెండర్లు దాఖలు చేయగా,104 మద్యం షాపులకు లక్కీడిప్ ద్వారా 104 మందిని ఎంపిక చేసినట్లు కలెక్టర్ తెలిపారు.ఈ లక్కీడిప్ కార్యక్రమంలో ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ విజయ్ శేఖర్, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ శ్రీనివాస్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు. లక్కీ డిప్ కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా భారీ బందో ఏర్పాటు చేశారు.

ఏమిటి సారూ.. ఈ వివాదాస్పద నిర్ణయాలు..

ఈవో తీరుపై మండిపడుతున్న భక్తులు - ఆలయ ఉద్యోగులకు తప్పని తిప్పలు

ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తున్నా.. మౌనం వీడని నాయకులు



విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: ఏదైనా ఒక నిర్ణయం తీసుకొంటే అది పది మందికి ఉపయోగ పడేదిలా ఉండాలి.. అందరూ ఎంతో మెచ్చుకునేలా ఉండాలి.. అందుకు విరుద్ధంగా అందరూ తిట్టుకొనేలా.. శాపనార్థాలు పెట్టేలా.. ఉంటే ఆ నిర్ణయాలు ఏ విధంగా ఉన్నాయో ఇట్టే అర్థం చేసుకో వచ్చు. దక్షిణ కాశికా పేరు ప్రఖ్యాతలుగాంచిన శ్రీకాళహ స్తీశ్వరాలయానికి ఇటీవల కొత్తగా వచ్చిన అధికారి తీసుకొనే నిర్ణయాలు వివాదాస్పదం అవుతున్నాయి..ఆయన నిర్ణయాలతో ఇటు ఉద్యోగులు అటు భక్తులు ఒకరేంటి అందరూ ముప్పుతిప్పలు పడుతున్నారు.. దీనికితోడు ప్రభుత్వా నికి.. ఆలయానికి చెడ్డపేరు వస్తోంది. దాదాపు గా ఆయన ఇదివరకు పని చేసిన చోటా అంతా ఇదే పరిస్థితి ఉందని విమర్శలు ఉన్నాయి.మరి ఇలాంటి వ్యక్తిని ప్రభుత్వం తిరుపతి ఆర్ జెసిగా శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవోగా నియమించిది. ఈయనపైనా ఎన్నో ఆరోపణలు, విమర్శలు ఉన్నా. అవేమి పట్టించుకోకుండా ఎంతో కీలక మైన పోస్టులు అప్పగి ంచింది. ఆయన అధికారం చేపట్టి రాగానే భక్తులకి కష్టాలు ప్రారంభం అయ్యాయి. ఈయన గారి వివాదాస్పద నిర్ణయాలతో తీవ్రస్థా యిలో విమర్శలు వస్తున్నాయి. ముందు వెనుకా ఆలోచించకుండా ఇష్టమొచ్చినట్లు నిర్ణయాలు తీసుకోవడంపై ఎన్ని విమర్శలు వస్తున్నా ఆయన మాత్రం తాను అనుకున్నది చేసుకుంటూ వెళ్లిపోతున్నారు. గత ప్రభుత్వంలో ముక్కంటి ఆలయంలో పనిచేసే కొందరు వ్యక్తులతో ఇతను తత్సంబంధాలు కొనసాగిస్తున్నారని వారి సలహాలు సూచనలతోనే వివాదా స్పద నిర్ణయాలు తీసుకుంటున్నారని తద్వారా ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని ఆరోపణలు సైతం ఉన్నాయి. ప్రభుత్వం కొన్ని రోజుల క్రితం శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవోగా చంద్రశేఖర్ ఆజాద్‌ను నియమించింది. ఈయన గతంలో ప్రముఖ ఆలయాల్లో పనిచేశారు. శ్రీకాళహస్తీశ్వరా లయానికి వచ్చి రావడంతోనే ఆయన వివాద్పద నిర్ణయాలతో పత్రికలకు ఎక్కుతున్నారు. ముఖ్యంగా ఆలయం రాహుకేతు పూజలకు ఎంతో ప్రసిద్ధి చెందింది. ఈ పూజల ద్వారానే ఆలయానికి ఏటా కోట్లాది రూపాయిల ఆదాయం వస్తోంది. తమిళనాడు, కర్నాటక, ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు ఆలయానికి పూజల కోసమే వస్తుంటారు. అయితే గతంలో ఎన్నడూ లేని విధంగా వచ్చే భక్తులు సంప్రదాయ దుస్తుల్లోనే ఖచ్చితంగా హాజరు కావాలంటూ కొత్తగా నిబంధన పెట్టేశారు. దీనిపైనా కనీసం భక్తులకు ఎలాంటి సమాచారం, ప్రకటన ఇవ్వకుండానే కొనుగోలు చేసే టికెట్లపై సాంప్రదాయ దుస్తులు ధరించి రావాలి అని ముద్రించకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకునేశారు. నిర్ణయం అమలు చేసేముందు కనీసం అధికారులతో, ఆలయ వేదపండితులతో చర్చించి ఒక ప్రకటన జారీ చేసి ఉన్నా ఇబ్బంది ఉండేది కాదు, కానీ అందుకు విరుద్ధంగా ఏక పక్షంగా నిర్ణయం తీసుకోవడంతో భక్తులు మండిపడుతున్నారు. ప్రస్తుతం ఆలయంలో రూ. 500 నుంచి రూ.5వేల వరకు వివిధ స్థాయిలో రాహు కేతు సర్ప దోష నివారణ పూజలు జరుగుతున్నాయి. ఈ పూజల్లో పాల్గొనే ఏ భక్తుడైనా సంప్రదాయ దుస్తులు ధరించకపోతే పూజల్లోకి అనుమతించవద్దని అలా ఎవరైనా అనుమతిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆదేశాలు జారీ చేశారు. దీంతో చేసేది లేక క్రింది స్థాయి అధికారులందరూ ఈ నిబంధనలు అమలు చేస్తున్నారు. అసలు విషయం తెలియకుండా వందలాది మంది భక్తులు మండపాలకు రావడం అధికారులు వస్త్రధారణ పేరుతో అభ్యంతరం తెలపడంతో తిరిగి వెళ్లిపోవడం తరుచూ జరుగుతోంది. ఇది అధికారులకు తీవ్ర తలనొప్పిగా మారింది. ఆలయంలో నిబంధనలు ఒకేసారి అమలు కావాలంటే ఎంతో కష్టంతో కూడుకున్న వ్యవహారం, అందులోనూ ఖచ్చితంగా అమలు చేయాలంటే దాని వల్ల ఎన్నో ఇబ్బందులు వచ్చే పరిస్థితి ఉంటుంది. ముందుగా పత్రిక ప్రకటనలు, సూచన బోర్డులు పెట్టి కొన్ని నెలల తరువాత ఇబ్బంది ఉండేది కాదు. కానీ అందుకు విరుద్ధంగా నిర్ణయం తీసుకోవటమే ఇప్పుడు సమస్యగా మారింది.జేబులో డబ్బులుంటే ఇక అంతే..ఆలయంలో పనిచేసే ఎవరైనా, పొరబాటునా జేబులో డబ్బులు పెట్టుకొని వారిపై కఠిన చర్యలు తీసుకోవడంపై తీవ్ర స్థాయిలో విమర్శలు వస్తున్నాయి. జేబులో డబ్బులున్నంత మాత్రానా ప్రతి ఒక్కరు తప్పులు చేస్తారనే అభిప్రాయం రావటం మంచి పద్ధతి కాదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. కానీ అందుకు విరుద్ధంగా ఈయన ప్రవరిస్తున్నారనేది ఉద్యోగుల వాదన. ఆలయంలో ఎవరైనా భక్తుల నుంచి డబ్బులు తీసుకున్నా, తప్పుడు పనులు చేసినా సీసీ కెమెరాలు ఎలాగూ అందుబాటులోనే ఉన్నాయి. వీటిలో పరిశీలించి చర్యలు తీసుకున్నా అర్థముంది అందుకు విరుద్ధంగా డబ్బులుంటే చర్యలు అనే విధానంపై తీవ్రస్థాయిలో విమర్శలు వస్తున్నాయి. ఇక ఆలయంలో పనిచేసే ఉద్యోగులందరూ బయోమెట్రిక్ హాజరు వేయాల్సిందేనని ఇటీవల ఈవో ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ వరకు బాగానే ఉన్నా అందరూ ఇది పాటించడం కొంతవరకు ఇబ్బందికరమైన విషయం. వెయ్యిలింగాల కోన, బైరవకోన, ఊరందూరు, కన్నలి మరికొన్ని ప్రాంతాల్లో అనుబంధ ఆలయాలున్నాయి. వీరికి మొబైల్ ద్వారా ఆలయం నుంచే బయోమెట్రిక్ అమలు చేస్తే ఇబ్బందులు తీరుతాయి. అలా కాకుండా ఉదయం ఒకసారి ఆలయానికి వచ్చి మరి వేయాలని నిబంధన పెట్టడంతో ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు.స్థానికులకు దూరంశ్రీకాళహస్తీశ్వరాలయం అంటే స్థానికులు.. స్థానికులంటేనే శ్రీకాళహస్తీశ్వరాలయం.. గతంలో ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా స్థానికుల దర్శనాల విషయంలో ఎలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకునేవి కావు. ఏదైనా పొరబాటునా నిర్ణయం తీసుకున్నా అది తీవ్ర ప్రభావం చూపిస్తుందని అచితూచి వ్యవహరించేవారు. కానీ ఈయన ఆలయానికి వచ్చే స్థానికులెవరైనా ఉదయం సాయంత్రం నిర్ణీత సమయంలో పిఆర్వో కార్యాలయం నందు ఆధార్ కార్డు చూపించి స్లిప్పు తీసుకుని రావాల్సిందేనంటూ ఆదేశాలు జారీ చేసేశారు. దీనిపై స్థానికులు దుమ్మెత్తిపోస్తున్నారు. ఆలయానికి తమకు ఎంతో అవినాబావ సంబంధం ఉందని, పి ఆర్ ఓ కార్యాలయానికి వెళ్లి స్లిప్పులు తీసుకొని తీసుకుని రావాలని చెప్పడానికి ఆయన ఎవరూ ? అమలు చేసేందుకు మీరెవరూ అంటూ? ఉద్యోగస్తులను స్థానిక మహిళా భక్తులు ప్రశ్నించే పరిస్థితి నెలకొంది. ఈ నిర్ణయం అమలు చేయకపోతే తాము ఎక్కడ సస్పెండ్ అయిపోతామో అని అధికారులు లోపల మదన పడుతున్నారు.దీనిపై స్థానికులు మండిపడుతున్నారు. ముక్కంటి భక్తులు నిత్యం కూలైన్ల వద్ద తమకు కనీస త్రాగునీరు వసతులు కల్పించడం లేదని అధికారులతో ఈ విషయమై వివాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఇంత జరుగుతున్నా ఆయన మాత్రం తన వైఖరి మార్చుకోకపోవడం గమనార్హం. అంతే కాకుండా అభిషేక సమయాల్లో బయట నుంచి కూడా స్థానికులు, సాధారణ భక్తులు చూడలేని విధంగా చేయటం ఎంత వరకు సబబు అని ప్రశ్నిస్థున్నారు. ఇది ఇలా ఉంటే గత ప్రభుత్వ హయాంలోని ముక్కంటి ఆలయంలోని ముఖ్యమైన వ్యక్తులతో ఈయనకు సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలు సైతం ఉన్నాయి. వారి సలహా సూచనలతోనే ఈయన ఆలయంలో ఉద్యోగులపై కక్ష సాధింపులు చర్యలు చేపడుతున్నారని విమర్శలు సైతం వినిపిస్తున్నాయి. ఇక ఆలయంలో రూ.5వేల రాహుకేతు పూజలు చేసుకునే వారికి ఆలయం తరఫున ఎలాంటివి అందజేయరు. వీరికి కేవలం అంతరాలయ దర్శనం మాత్రమే అనుమతిస్తారు. కానీ ఆయన వచ్చి రాగానే అంతరాలయ దర్శనాన్ని కూడా ఆపించేశారు. అంతేకాకుండా ఆలయానికి విరాళాలు ఇచ్చే ప్రముఖలను, భక్తులను అంతరాలయం దర్శనం లేకుండా ఆదేశాలు జారీ చేశారు. దీనిపై దాతలు తీవ్రస్థాయిలో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము ఎంతో ఆశగా స్వామివారికి విరాళం అందజేస్తామని, కేవలం అంతరాలయం దర్శనాన్ని ఆపేయడం మంచి పద్ధతి కాదని చెబుతున్నారు. మరో పక్క ఇతని నిర్ణయాలపై ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తున్నా పాలకులు కూటమి నేతలు మాత్రం స్పందించడం లేదని స్థానిక భక్తులు. కూటమి ప్రభుత్వం మౌనంగా ఉండటంతో స్థానిక పుర ప్రజలు పలువురు దీనిపై సామాజిక మాధ్యమాల్లో తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వివాదా నిర్ణయాలు తీసుకుంటూ ఇటు భక్తులను ఉద్యోగులను స్థానిక భక్తులను తీవ్ర ఇబ్బందులు గురిచేస్తున్న వ్యక్తిని సాగనంపాల్సిన అవసరం ఆవశ్యకత ఎంతైనా ఉందని స్థానిక పుర ప్రజలు ముక్కంటి భక్తులు కోరుతున్నారు. మరి దేవాదాయ శాఖ అధికారులు ఏ మేరకు చర్యలు చేపడతారో వేచి చూడాల్సి ఉంది.